జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక

సంపుటి :13 సంచిక :59 ఆదివారం 1-11-2026 పేజీలు:8 వెల:రు 3 /-

https://www.epaperjournalistdiary.com/

ఏపీలో నేడే 'మున్సిపల్ ఎన్నికల' 'పోలింగ్'..

- సర్వం సిద్ధం.. ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలతో నిఘా
- ఆంధ్రప్రదేశ్‌లో పుర, నగర పాలక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- 36,351 మంది పోలీసులతో చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ బందోబస్తు
- సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు లేదా వెబ్‌కాస్టింగ్
- ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న 75 వేల మంది పోలింగ్ సిబ్బంది
- ఓటర్లు ఎలాంటి భయం లేకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఈసీ పిలుపు

07

తుది పోరుకు టీమిండియా సిద్ధం

- నేడు న్యూజిలాండ్‌తో ఐదో టీ20
- నాలుగో టీ20లో 87 పరుగుల తేడాతో భారత్‌కు పరాజయం
- క్లీన్‌స్వీప్ ఆశలకు బ్రేక్.. సిరీస్‌పై ఉత్కంఠ
- కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిలలో ఒకరికి ఛాన్స్
- భువనేశ్వర్ కుమార్‌ను తీసుకొచ్చే యోచన
- విజయంతో సిరీస్‌ను ముగించాలని ఇరు జట్ల పట్టుదల

02

02

వైమానిక దళ చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్

- అమర్ ప్రీత్ సింగ్ పదవీ విరమణతో బాధ్యతల స్వీకరణ
- 1986లో వాయుసేనలో చేరిన దీక్షిత్
- నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సేవా అనుభవం
- దాదాపు 20 రకాల యుద్ధ విమానాలను నడిపిన నైపుణ్యం
- మిరాజ్-2000, మిగ్, జాగ్వార్, తేజస్ విమానాలపై పట్టు
- 3,500 గంటలకు పైగా విమానయానం చేసిన అనుభవం
- ఆపరేషన్ సఫేద్ సాగర్, రక్షక్, సింధూర్‌లో కీలక సేవలు
- వ్యూహాత్మక ప్రణాళికల్లో ప్రత్యేక గుర్తింపు

జ్ఞానేశ్ దేశద్రోహి!

- సీఈసీని పదవి నుంచి తొలగించాలని ఇండియా కూటమి డిమాండ్
- ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా వ్యవహరించారని ఆరోపణ
- ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాల విమర్శ
- ఎస్ఐఆర్ పేరుతో 13.2 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారని ఆరోపణ
- ఫారం-6 నిబంధనల్లో అక్రమ మార్పులు చేశారని అభియోగం
- ఇతర ఎన్నికల కమిషనర్లను నిర్ణయాల ప్రక్రియకు దూరంగా ఉంచారని విమర్శ
- సీఈసీపై న్యాయస్థానంలో దేశద్రోహం అభియోగాల విచారణకు డిమాండ్
- ప్రతిపక్షాల ఆరోపణలను ఖండించిన బీజేపీ

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని ఇండియా కూటమి డిమాండ్ చేసింది. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా వ్యవహరించారని ఆరోపిస్తూ, ఆయనపై దేశద్రోహం అభియోగాలపై విచారణ జరపాలని కోరింది. ఈ ఆరోపణలను బీజేపీ ఖండించింది.

02

అబద్ధాల్లో రేవంత్‌కు ఆస్కార్ ఇవ్వొచ్చు!

- మియాపూర్ భూములపై సీఎం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు
- బీఆర్ఎస్‌పై విమర్శలు.. హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం
- అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా రేవంత్ నిలిచిపోతారు
- సుప్రీంకోర్టు తీర్పుతో ప్రభుత్వానికి భూములపై హక్కులు
- తీర్పు కాపీ రాకముందే భూముల అమ్మకంపై ఆతృత ఎందుకని ప్రశ్న
- కేసీఆర్ హయాంలో న్యాయపోరాటంతో భూములు కాపాడాం
- మంచిరేవుల భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే యత్నం
- సెంట్రల్ యూనివర్సిటీ భూములను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్ల అప్పు

హైదరాబాద్

మియాపూర్ భూముల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అబద్ధాలకు రేవంత్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిపోతారని, ఆయనకు అబద్ధాల్లో ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని ఎద్దేవా చేశారు. మియాపూర్ భూములు తెలంగాణ ప్రభుత్వానికే చెందుతాయని సుప్రీంకోర్టు వెల్లడించిన నేపథ్యంలో సీఎం చేసిన వ్యాఖ్యలను -మిగతా 2 లో

ఓటు చోరీతో నెహ్రూ పీఎం అయ్యారు!

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సంచలన ఆరోపణలు
- పటేల్‌కు మద్దతు ఉన్నా నెహ్రూకు ప్రధాని పదవి దక్కిందని వ్యాఖ్య
- కాంగ్రెస్ గతంలోనే ఓటు చోరీకి పాల్పడిందని విమర్శ
- 550 సంస్థానాలను విలీనం చేసిన ఘనత పటేల్‌దే
- నెహ్రూ స్వార్థ రాజకీయాలతో విలీన ప్రక్రియలో గందరగోళం
- మోదీ వల్లే జమ్మూ కశ్మీర్ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- పటేల్ జీవిత చరిత్రను యువత తెలుసుకోవాలి: రామచందర్‌రావు
- బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పటేల్ జయంతి వేడుకలు

/హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ గతంలోనే ఓటు చోరీకి పాల్పడిందని, ఆ విధంగా జవహర్‌లాల్ నెహ్రూను ప్రధానిని చేసిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం ఓటు చోరీ జరిగిందంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారని, కానీ గతంలో ఆ పార్టీ చేసిన పనులను గుర్తు చేసుకోవాలని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. -మిగతా 2 లో

యూపీలో 1.27 కోట్ల హిందువుల ఓట్లు గల్లంతు

02

రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోంది..

- రాప్తాడు ఘటనే నిదర్శనం...వైసీపీ అధినేత, మాజీ సిఎం జగన్
- రాప్తాడు పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై కిరాతక దాడి
- టీడీపీ పాలనలో శాంతి, భద్రతలు పూర్తిగా విఫలమయ్యాయన్న మాజీ సీఎం జగన్
- ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి, నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని హామీ
- బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం
- ఘటనపై విస్తృత దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, -నిందితుడి కోసం గాలింపు

08

02

నేడు ఢిల్లీలో ఇండియా కూటమి మెగా ర్యాలీ

- మధ్యాహ్నం 12 గంటలకు 'చలో ఢిల్లీ' ప్రదర్శన
- అనంతరం రామ్‌లీలా మైదానంలో బహిరంగ సభ
- ఎన్నికల అక్రమాలపై ప్రతిపక్షాల నిరసన
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్
- 4 వేల మందికి పైగా పోలీసులతో భద్రత
- నిఘా కోసం 200కు పైగా సీసీటీవీ కెమెరాలు
- ర్యాలీకి 10 లక్షల మంది వస్తారని కూటమి అంచనా
- ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు

స్కూల్‌లో దారుణం..

పదో తరగతి 'విద్యార్థిని'పై 'ఎలక్ట్రిక్ రంపం'తో పాశవిక దాడి!

- రాప్తాడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఘటన
- పదో తరగతి విద్యార్థినిపై రంపంతో దాడి
- బాలిక ముఖం, తల, వీపుపై తీవ్ర గాయాలు
- అడ్డుకునేందుకు వెళ్లిన మరో విద్యార్థినికి గాయాలు
- బాలికను ఆసుపత్రికి తరలించి చికిత్స

10 వ తరగతి బాలికపై దాడి చేసిన ఉన్మాది

రాప్తాడు,అనంతపురం జిల్లా, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : అనంతపురం జిల్లాలోని రాప్తాడు మండలంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై ఓ వ్యక్తి చెట్లను కోసే ఎలక్ట్రిక్ రంపంతో దాడి చేశాడు. ఈ ఘటనలో బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో చాలా తీవ్రమైన గాయాలయ్యాయి. ఆమెను చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు.పాఠశాలలోకి వచ్చిన నిందితుడు విద్యార్థినిపై ఒక్కసారిగా దాడికి పాల్పడినట్లు సమాచారం. ఆమెపై దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడింది. ఈ ఘటనతో పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు -మిగతా 2 లో

నింగిలోకి నావిక్



న్యూఢిల్లీ
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో కీలక విజయాన్ని సాధించింది. దేశీయ నావిగేషన్ వ్యవస్థ 'నావ్‌ఐసీ'ని బలోపేతం చేసే లక్ష్యంతో చేపట్టిన ఎన్‌వీఎస్-03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి శుక్రవారం రాత్రి 11.51 గంటలకు జీఎస్ఎల్‌వీ-ఎఫ్18 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ప్రయోగం జరిగిన సుమారు 20 నిమిషాల తర్వాత 2,250 కిలోల బరువున్న ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని రాకెట్ నిర్దేశిత జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. రాకెట్‌లోని అన్ని వ్యవస్థలు సమర్థంగా పనిచేశాయని, ఉపగ్రహం ఆరోగ్యంగా ఉందని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ధ్రువీకరించారు. ఈ ప్రయోగంతో 'నావ్‌ఐసీ' వ్యవస్థ సమర్థంగా పనిచేయడానికి అవసరమైన కనీసం నాలుగు ఉపగ్రహాల మైలురాయిని ఇస్రో చేరుకుంది. ఉపగ్రహంలో దేశీయంగా అభివృద్ధి చేసిన అణు గడియారాన్ని అమర్చడం ప్రత్యేకతగా నిలిచింది. ఇప్పటికే ఉన్న ఎల్5, ఎస్-బ్యాండ్ సిగ్నళ్లతోపాటు కొత్తగా ఎల్1 ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌లోనూ ఇది సంకేతాలను ప్రసారం చేయనుంది. దీంతో స్థాననిర్ణయం, నావిగేషన్, సమయ నిర్ధారణ (పీఎన్‌టీ) సేవలు మరింత బలోపేతం కానున్నాయి. భారత భూభాగంతోపాటు దేశ సరిహద్దుల నుంచి 1,500 కిలోమీటర్ల వరకు ఈ వ్యవస్థ సేవలు అందించనుంది. గతంలో తొలి తరం ఉపగ్రహాల జీవితకాలం ముగియడం, అణు గడియారాల్లో సమస్యలు తలెత్తడం, ఎన్‌వీఎస్-02 ఉపగ్రహం ప్రొపల్షన్ సమస్యతో ఆశించిన విధంగా పనిచేయకపోవడం వంటి సవాళ్లు ఎదురయ్యాయి. వాటి నేపథ్యంలో ఎన్‌వీఎస్-03 ప్రయోగం విజయవంతం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. కేవలం 56 రోజుల వ్యవధిలోనే మరో జీఎస్ఎల్‌వీ ప్రయోగాన్ని నిర్వహించడం ఇస్రో ప్రయోగ సామర్థ్యాన్ని చాటుతోంది. ప్రస్తుతం ఉపగ్రహం తనలోని ఇంజిన్ల సాయంతో తదుపరి కక్ష్య పెంపు విన్యాసాలను చేపట్టనుంది. అనంతరం తుది పరీక్షలు పూర్తయ్యాక నావ్‌ఐసీ వ్యవస్థలో సేవలు అందించడం ప్రారంభిస్తుంది. రహదారి, సముద్ర నావిగేషన్, విపత్తుల నిర్వహణ, వ్యవసాయం వంటి పౌర అవసరాలతోపాటు సైనిక, వ్యూహాత్మక అవసరాలకు కూడా ఈ వ్యవస్థ కీలకంగా మారనుంది. దేశీయ నావిగేషన్ సేవలపై స్వావలంబనను పెంచడంలో ఎన్‌వీఎస్-03 ప్రయోగం మరో ముందడుగుగా నిలిచింది.

వైమానిక దళ చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్

న్యూఢిల్లీ:
భారత వైమానిక దళం (ఐఏఎఫ్) అధిపతిగా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈ పదవిలో కొనసాగిన ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ శనివారం పదవీ విరమణ చేయడంతో దీక్షిత్ బాధ్యతలు చేపట్టారు. యుద్ధ విమానాలను నడపడంలో విశేష అనుభవం, వ్యూహాత్మక ప్రణాళికల్లో నైపుణ్యం ఉన్న ఆయనకు వాయుసేనలో సుదీర్ఘ సేవా నేపథ్యం ఉంది. 1966 డిసెంబర్ 9న జన్మించిన అశుతోష్ దీక్షిత్ 1986 డిసెంబర్ 6న భారత వైమానిక దళంలో చేరారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా వివిధ హోదాల్లో పనిచేస్తూ అనేక కీలక బాధ్యతలు నిర్వర్తించారు. మిరాజ్-2000, కిరణ్, మిగ్, జాగ్వార్, తేజస్ వంటి యుద్ధ విమానాలను నడిపిన అనుభవం ఆయనకు ఉంది. మొత్తం 3,500 గంటలకు పైగా విమానయానం చేసిన ఆయన, దాదాపు 20 రకాల యుద్ధ విమానాలను నడిపిన నైపుణ్యాన్ని సొంతం చేసుకున్నారు. దేశ రక్షణకు సంబంధించిన పలు కీలక సైనిక కార్యకలాపాల్లోనూ దీక్షిత్ భాగస్వామిగా ఉన్నారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, ఆపరేషన్ సింధూర్ వంటి ఆపరేషన్లలో సేవలందించారు. ముఖ్యంగా ఆపరేషన్ సింధూర్ సమయంలో వ్యూహాత్మక ప్రణాళికల్లో కీలక పాత్ర పోషించినట్లు ఆయనకు గుర్తింపు ఉంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, 2028 డిసెంబర్ 31 వరకు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు.

అబద్ధాల్లో రేవంత్‌కు ఆస్కార్ ఇవ్వొచ్చు!

మొదటి తరువాయి

హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. అబద్ధాలు చెబుతూ క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు కాపీ కూడా అందకముందే మియాపూర్ భూములను విక్రయించాలనే ఆతృత ముఖ్యమంత్రిలో కనిపించిందని హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌ను నియమించి, భూములు ప్రభుత్వానికి దక్కేలా న్యాయపోరాటం చేశామని గుర్తుచేశారు. ఆ పోరాటం ద్వారానే ప్రభుత్వ భూములను కాపాడగలిగామని పేర్కొన్నారు. మంచిరేవులలో 142 ఎకరాల భూములను కాపాడినట్లు గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. అదే భూముల్లోని 10 ఎకరాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నించిందని హరీశ్‌రావు ఆరోపించారు. భూపాలపల్లి, హయత్‌నగర్ ప్రాంతాల్లోని భూములను కాపాడేందుకు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేసిందని తెలిపారు. మరోవైపు, సెంట్రల్ యూనివర్సిటీ భూములను తాకట్టు పెట్టి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.10 వేల కోట్ల అప్పు తెచ్చుకుందని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ప్రశ్నిస్తూ, బీఆర్ఎస్‌పై చేస్తున్న ఆరోపణలకు ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

నవంబర్‌లోనూ ఎండల తీవ్రత!

న్యూఢిల్లీ
దేశంలో చలి తీవ్రత పెరగాల్సిన నవంబర్‌లోనూ ఎండలు మండిపోనున్నాయి. దేశంలో చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ)వెల్లడించింది. హిమాలయ పర్వత పాద ప్రాంతాల్లో మాత్రం సాధారణ లేదా అంతకంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తన నెలవారీ నివేదికలో తెలిపింది. అయితే మధ్య, తూర్పు భారతదేశంలోని పలు ప్రాంతాల్లో సాధారణం లేదా అంతకంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.నవంబర్‌లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ అంచనా వేసింది. మధ్య, వాయవ్య, ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం నుంచి అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా నవంబర్‌లో దీర్ఘకాలిక సగటు వర్షపాతం(ఎల్‌పీఏ)లో 77 శాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉంది. మరోవైపు పసిఫిక్ మహా సముద్రంలో ప్రస్తుతం అత్యంత బలమైన ఎల్‌నినో పరిస్థితులు కొనసాగుతున్నాయి. నవంబర్, డిసెంబర్ నెలల్లోనూ ఇవి కొనసాగవచ్చని వాతావరణ నమూనాలు సూచిస్తున్నాయి.

యూపీలో 1.27 కోట్ల హిందువుల ఓట్లు గల్లంతు

లక్నో: ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సమీక్ష(సర్) ప్రక్రియలో బీజేపీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాల నుంచి కోట్లాది మంది హిందువుల పేర్లు తొలగిపోయాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పార్టీ కార్యకర్తలనుద్దేశించి యోగి మాట్లాడుతూ ఓటర్ల జాబితాల నుంచి రాష్ట్రంలో 1.27 కోట్ల మంది హిందువుల పేర్లు గల్లంతయ్యాయన్నారు. అర్హులైన ఓటర్లందరూ జాబితాలో చేరేలా చూడాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఈ తొలగింపులు 28 స్థానిక సంస్థ నియోజకవర్గాల్లో పార్టీ స్థానాన్ని బలహీనపరుస్తున్నాయని ఆయన తెలిపారు.

తుది పోరుకు టీమిండియా సిద్ధం

-నేడు న్యూజిలాండ్‌తో ఐదో టీ20
-నాలుగో టీ20లో 87 పరుగుల తేడాతో భారత్‌కు పరాజయం
-క్లీన్‌స్వీప్ ఆశలకు బ్రేక్.. సిరీస్‌పై ఉత్కంఠ
-కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిలలో ఒకరికి ఛాన్స్
-భువనేశ్వర్ కుమార్‌ను తీసుకొచ్చే యోచన
-విజయంతో సిరీస్‌ను ముగించాలని ఇరు జట్ల పట్టుదల

హామిల్టన్: న్యూజిలాండ్ పర్యటనలో వరుస విజయాలతో దూసుకెళ్తున్న టీమిండియాకు నాలుగో టీ20లో ఎదురుదెబ్బ తగిలింది. వెల్లింగ్టన్ వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు సమష్టిగా రాణించి భారత్‌పై 87 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేసింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో క్లీన్‌స్వీప్ చేయాలన్న భారత ఆశలకు బ్రేక్ పడింది. మరోవైపు ఈ విజయంతో న్యూజిలాండ్ సిరీస్‌లో పుంజుకుంది. ఈ నేపథ్యంలో ఆదివారం జరగనున్న ఐదో, చివరి టీ20పై ఆసక్తి నెలకొంది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను విజయంతో ముగించడంతోపాటు, వన్డే సిరీస్‌కు ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలని భారత్ భావిస్తోంది. అటు నాలుగో టీ20లో సాధించిన విజయాన్ని కొనసాగించి సిరీస్‌ను 3--2తో ముగించాలని న్యూజిలాండ్ పట్టుదలతో ఉంది. నాలుగో టీ20లో ఎదురైన పరాజయంతో భారత జట్టు మేనేజ్‌మెంట్ తుది జట్టు కూర్పుపై దృష్టి సారించే అవకాశం ఉంది. ముఖ్యంగా బౌలింగ్ విభాగంలో మార్పులు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఆఖరి మ్యాచ్‌లో స్పెషలిస్ట్ స్పిన్నర్‌ను ఆడించాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిలలో ఒకరికి తుది జట్టులో అవకాశం దక్కవచ్చు. అదే జరిగితే ఆల్‌రౌండర్ నీతీశ్ కుమార్ రెడ్డిని బెంచ్‌కు పరిమితం చేసే అవకాశముంది. మరోవైపు అనుభవజ్ఞుడైన పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను తిరిగి జట్టులోకి తీసుకురావాలని కూడా యోచిస్తున్నట్లు సమాచారం. అతడికి అవకాశం దక్కితే యువ పేసర్ మయాంక్ యాదవ్ తుది జట్టులో చోటు కోల్పోవచ్చు. అయితే బ్యాటింగ్ విభాగంలో మాత్రం పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని తెలుస్తోంది. ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ బరిలోకి దిగే అవకాశం ఉంది. మూడో స్థానంలో ఇషాన్ కిషన్, ఆ తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మిడిలార్డర్‌లో నమన్ ధీర్, అక్షర్ పటేల్ తమ స్థానాల్లో కొనసాగవచ్చు. బౌలింగ్ విభాగంలో అర్ష్‌దీప్ సింగ్, భువనేశ్వర్ కుమార్, ప్రిన్స్ యాదవ్ పేస్ బాధ్యతలు పంచుకునే అవకాశం ఉంది. మయాంక్ యాదవ్‌ను కొనసాగించాలని నిర్ణయిస్తే అర్ష్‌దీప్ సింగ్‌కు విశ్రాంతి ఇచ్చే అవకాశమూ లేకపోలేదు. పిచ్ పరిస్థితులు, బౌలర్ల ఫిట్‌నెస్‌ను పరిగణనలోకి తీసుకుని తుది జట్టును ఎంపిక చేయనున్నారు. చివరి మ్యాచ్‌లో సమష్టిగా రాణించి విజయంతో పర్యటనను ముగించడమే భారత్ లక్ష్యంగా కనిపిస్తోంది.

జ్ఞానేశ్ దేశద్రోహి!

-సీఈసీని పదవి నుంచి తొలగించాలని ఇండియా కూటమి డిమాండ్
-ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా వ్యవహరించారని ఆరోపణ
-ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాల విమర్శ
-ఎస్ఐఆర్ పేరుతో 13.2 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారని ఆరోపణ
-ఫారం-6 నిబంధనల్లో అక్రమ మార్పులు చేశారని అభియోగం
-ఇతర ఎన్నికల కమిషనర్లను నిర్ణయాల ప్రక్రియకు దూరంగా ఉంచారని విమర్శ
-సీఈసీపై న్యాయస్థానంలో దేశద్రోహం అభియోగాల విచారణకు డిమాండ్
-ప్రతిపక్షాల ఆరోపణలను ఖండించిన బీజేపీ

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై ఇండియా కూటమి తీవ్ర ఆరోపణలు చేసింది. బీజేపీకి అనుకూలంగా జాతీయ, రాష్ట్ర ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే కుట్రలో ఆయన భాగస్వామిగా వ్యవహరించారని ఆరోపిస్తూ, సీఈసీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. ఆయనపై దేశద్రోహం అభియోగాలపై న్యాయస్థానంలో విచారణ జరపాలని కోరింది. ఎన్నికల అక్రమాలు, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో అక్టోబర్ 31న న్యూఢిల్లీలో నిర్వహించిన ప్రతీకాత్మక ప్రజా అభిశంసన కార్యక్రమంలో ఈ మేరకు తీర్మానం ఆమోదించినట్లు ప్రకటించాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ తీర్మానాన్ని చదివి వినిపించారు. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేందుకు ఓటర్ల జాబితాలను తమకు అనుకూలంగా మార్చుకునే అవకాశం కల్పించారని ఇండియా కూటమి ఆరోపించింది. అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించడం, కొత్త పేర్లను చేర్చడం ద్వారా ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపేలా వ్యవహరించారని విమర్శించింది. ఈ చర్యలు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి విరుద్ధమని పేర్కొంది. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసేలా సీఈసీ వ్యవహరించారని ఆరోపించింది. ఎస్ఐఆర్ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా, పక్షపాత ధోరణితో, పారదర్శకత లేకుండా నిర్వహించారని ప్రతిపక్షాలు విమర్శించాయి. ఈ ప్రక్రియలో 13.2 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించారని, తద్వారా వారి రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కుకు భంగం కలిగిందని తీర్మానంలో పేర్కొన్నాయి. అయితే, ఈ సంఖ్యతో పాటు ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం-6లో పార్లమెంటు పర్యవేక్షణ లేకుండా మార్పులు చేశారని ఇండియా కూటమి ఆరోపించింది. తొలిసారి ఓటర్లుగా నమోదు కావాల్సిన యువతకు ఇబ్బందులు కలిగించేలా ఈ మార్పులు ఉన్నాయని పేర్కొంది. ఓటర్ల జాబితాల నిర్వహణ అధికారాలను కేంద్రీకరించడంతోపాటు, అర్హులైన కొత్త ఓటర్ల పేర్ల నమోదు ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయని విమర్శించింది. ఈవీఎంల సాఫ్ట్‌వేర్ దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలను కూడా తీర్మానంలో ప్రస్తావించింది. ఎన్నికల కమిషన్‌లోని మరో ఇద్దరు కమిషనర్లను నిర్ణయాలు తీసుకునే ప్రక్రియ నుంచి ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టారని ప్రతిపక్ష కూటమి ఆరోపించింది. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్న రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయాలు తీసుకున్నారని విమర్శించింది. అలాగే, బీజేపీకి అనుకూలంగా వ్యవహరించినందుకు సీఈసీ కుటుంబ సభ్యులకు పదవులు, ఆర్థిక ప్రయోజనాలు కల్పించారన్న ఆరోపణలూ చేసింది. ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్రంగా నిర్ధారించే ఆధారాలను మాత్రం తీర్మానం వివరించలేదు. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఆయనపై చేసిన ఆరోపణలపై చట్టప్రకారం విచారణ జరపాలని ఇండియా కూటమి డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమానికి మాజీ లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్ అధ్యక్షత వహించారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్‌తో పాటు సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ తదితర పార్టీల నాయకులు, ఎంపీలు పాల్గొన్నారు. ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన ఇండియా కూటమి భారీ ర్యాలీకి ముందు ఈ కార్యక్రమం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, ఎన్నికల అక్రమాలపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను బీజేపీ ఖండించింది. ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందడంలో విఫలమైన ప్రతిపక్షాలు రాజ్యాంగ సంస్థలపై దాడులకు దిగుతున్నాయని విమర్శించింది. రాజకీయంగా ఎదుర్కోలేక ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేస్తున్నాయని ఎద్దేవా చేసింది. దీంతో సీఈసీపై ప్రతిపక్షాల ఆరోపణలు, బీజేపీ ఖండనతో దేశ రాజకీయాల్లో మరోసారి వాదోపవాదాలు తీవ్రతరమయ్యాయి.

స్కూల్‌లో దారుణం..

(మొదటి తరువాయి)

భయాందోళనకు గురయ్యారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు వెంటనే అప్రమత్తమైన ఉపాధ్యాయులు, విద్యార్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. దాడికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన బాలికకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

వర్కర్ అనుకున్నాం..
స్కూల్‌లో కొన్ని మరమ్మతు పనులు జరుగుతున్నాయని హెడ్ మాస్టర్ తెలిపారు. నిందితుడు స్కూల్లోకి వస్తున్న సమయంలో ఉపాధ్యాయులు గమనించినప్పటికీ.. వర్కర్ అనుకున్నామని వెల్లడించారు. ఘటన జరిగినప్పుడు తరగతి గదిలో టీచర్ ఉన్నట్లు తెలిపారు. దాడి చేసిన వ్యక్తికి 25-30 ఏళ్ల వయసు ఉండొచ్చని అంచనా వేశారు. సరిగా గమనించే లోపే ఉన్మాది పారిపోయినట్లు పేర్కొన్నారు.

అదుపులోకి తీసుకున్న పోలీసులు...?
కాగా, ధర్మవరం వైపు వెళుతుండగా ఆ ఉన్మాదిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ యువకుడు బాలికకు సమీప బంధువేనని స్థానికులు చెబుతున్నారు

నేడు ఢిల్లీలో ఇండియా కూటమి మెగా ర్యాలీ

న్యూఢిల్లీ
దేశ రాజధానిలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం జరగనున్న ఇండియా కూటమి మెగా ర్యాలీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై నిరసన తెలిపేందుకు, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలు ఢిల్లీకి చేరుకుంటున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మింటో రోడ్-కనాట్ ప్లేస్ కూడలి నుంచి 'చలో ఢిల్లీ' ప్రదర్శన ప్రారంభమై రామ్‌లీలా మైదానానికి చేరుకోనుంది. అనంతరం అక్కడ బహిరంగ సభ నిర్వహించనున్నారు. సభ కోసం భారీ వేదికలు, పందిళ్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్ సదుపాయాలు కల్పించారు. ర్యాలీకి 4 వేల మందికి పైగా పోలీసులతోపాటు కేంద్ర సాయుధ పోలీసు బలగాలను మోహరించనున్నారు. మైదానాన్ని 14 జోన్లుగా విభజించి, 200కు పైగా సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ర్యాలీకి పది లక్షల మంది వరకు హాజరవుతారని ఇండియా కూటమి నేతలు అంచనా వేస్తుండగా, సుమారు 50 వేల మంది వస్తారని పోలీసులు భావిస్తున్నారు. సభా ఏర్పాట్ల కారణంగా మైదానం సామర్థ్యం 30 వేల నుంచి 40 వేల మందికి పరిమితం కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో శనివారం నిర్వహించిన ప్రతీకాత్మక ప్రజా అభిశంసన కార్యక్రమానికి కొనసాగింపుగా ఈ ర్యాలీ జరగనుంది. మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన జరిగిన ఆ కార్యక్రమంలో ఎన్నికల కమిషనర్‌పై ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలతో కూడిన తీర్మానాన్ని ఆమోదించారు.

ఓటు చోరీతో నెహ్రూ పీఎం అయ్యారు!

మొదటి తరువాయి

దేశానికి తొలి ప్రధానిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉండాలని పలువురు కోరుకున్నారని, ఆయనకు మద్దతు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ఓటు చోరీకి పాల్పడి నెహ్రూను ప్రధానిని చేసిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. పటేల్ తొలి ప్రధాని అయి ఉంటే దేశ పరిస్థితులు మరోలా ఉండేవని అభిప్రాయపడ్డారు. దేశంలోని 550 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో పటేల్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. సూర్యచంద్రులు ఉన్నంతకాలం పటేల్‌ను దేశ ప్రజలు మరచిపోరని అన్నారు. పటేల్ జయంతి వేడుకలను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. నిజాం పాలనలో ప్రజలపై అరాచకాలు జరుగుతున్న సమయంలో నెహ్రూ స్పందించలేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. నెహ్రూ లోపాయకారి ఒప్పందాలు, స్వార్థ రాజకీయ విధానాల కారణంగా సంస్థానాల విలీన ప్రక్రియలో తీవ్ర గందరగోళం ఏర్పడిందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న చర్యలతోనే జమ్మూ కశ్మీర్ ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు మాట్లాడుతూ యువత కాంగ్రెస్ కుటుంబ రాజకీయాలు, ఆ పార్టీ పాలనలో జరిగిన అవినీతి గురించి తెలుసుకోవాలని సూచించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో పటేల్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సిద్దాపూర్ డంపింగ్ యార్డు
జీవో 641 కి నేటితో 120 రోజులు!

నిరంతరాయంగా రిలే నిరహార దీక్షలు, జీవో రదయ్యే వరకు కొనసాగింపు

120 రోజుల ప్రజా పోరాటం... ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూపులు!

మన ఊరు-మన భవిష్యత్తు-మన హక్కు!



ప్రజాస్వామ్యంలో ప్రజల అభిప్రాయాలకు విలువ ఉండాలి. అభివృద్ధి పేరుతో తీసుకునే నిర్ణయాలు ప్రజల జీవన హక్కులకు, పర్యావరణానికి, వ్యవసాయానికి, భవిష్యత్తు తరాల మనుగడకు విఘాతం కలిగించకూడదు. ప్రజలకు సంబంధించిన కీలక నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి. ప్రజల ఆందోళనలను వినాలి. వారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. ప్రజల అభ్యంతరాలను గౌరవించి న్యాయమైన పరిష్కారం చూపాలి. అలా కాకుండా ఏక పక్షంగా రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కు కు భంగం వాటిల్లే విధంగా నిర్ణయాలు తీసుకుంటే ప్రజలు తిరగబడక తప్పదు.

ఈ ప్రజాస్వామిక స్ఫూర్తితోనే రంగారెడ్డి జిల్లా, కొత్తూరు మండలం, సిద్దాపూర్ గ్రామంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (SDVP JAC) ఆధ్వర్యంలో నిరంతరాయంగా ప్రజా ఉద్యమం కొనసాగుతోంది. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఆర్టీ నంబర్ 641 ద్వారా సిద్దాపూర్ పరిధిలోని 86 ఎకరాల భూమిని జీహెచ్ఎంసీకి బదలాయించే నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో స్థానిక ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ జీవో 641 కి నేటితో 120 రోజులు పూర్తవుతున్న సందర్భంలో, ఇప్పటివరకు సాగిన ప్రజా పోరాటాన్ని, ప్రజల ప్రధాన డిమాండ్లను, ప్రభుత్వ బాధ్యతను సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం సిద్దాపూర్ గ్రామంలో పరిశ్రమల ఏర్పాటు కోసమని రైతుల నుండి భూములను తీసుకున్నారు. దీనిపై కూడా అనేక విమర్శలు లేకపోలేదు. హైదరాబాద్ లో ఉన్న కాలుష్య కారక పరిశ్రమల కోసమే అని, కాదు కొంత ఐటీ హబ్ కోసం , కొంత వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ పరిశ్రమలు అనే చర్చ ఉంది. ఆ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక ఇక్కడ ఉన్న ప్రభుత్వ భూమిలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించిన విషయం తెలిసిన ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ చలో కలెక్టరేట్ పెట్టీ పెద్ద ఎత్తున ఆందోళన చేసింది. మేమేమన్నా తక్కువ అనే రీతిలో కాంగ్రెస్ పార్టీ కూడా పెద్ద ఎత్తున ఎమ్మార్వో కార్యాలయం వద్ద ధర్నా చేసి జాతీయ రహదారి పై రాస్తారోకో చేశారు. ఇలా జరుగుతున్న తరుణంలో స్తానిక శాసన సభ్యులు కాస్లాబాద్ శంకరయ్య అలియాస్ వీర్లపల్లి శంకర్ ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడ డంపింగ్ యార్డు రానివ్వని నాది బాధ్యత అని బరోసా ఇచ్చి ప్రజల ఆందోళనలు చలార్చారు. దీనికి సంబరబడ్డ ప్రజలు శాసన సభ్యులకు పాలాభిషేకాలు కూడా చేశారు... కానీ ఈ ఆనందం ఎంతోకాలం నిలవలేదు ఎమ్మెల్యే చెప్పిన కొన్ని రోజులకే తేదీ : 02.07.2026 నాడు రాష్ట్ర ప్రభుత్వం సిద్దాపూర్ లో ఉన్న ప్రభుత్వ భూమిలో 86 ఎకరాలు ఏకో పార్క్ పేరుమీద జీహెచ్ఎంసీ కి బదలాయిస్తూ "జీవో ఆర్టీ నెంబర్ : 641 ని తీసుకొచ్చింది". దీనిని జీర్ణించుకోలేని గిరిజన ప్రజలు కోడిచర్ల తండాలోఎమ్మెల్యే జిస్టీ బొమ్మను తగులబెట్టారు. దీనికి ప్రతీకగా గిరిజనులపై కేసులు నమోదు కావడం గమనార్హం. ఈ జీవో వచ్చిన వెంటనే లంబాడీ హక్కుల పోరాట సమితి (హ్రాపూరా) ఆధ్వర్యంలో షాద్ నగర్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి ఈ జీవోకి వ్యతిరేకంగా తీర్మానం చేయటం జరిగింది. ఈ సమావేశానికి అధికార పార్టీ మినహాయించి అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు పాల్గొన్నాయి. ఇంతటితో ఆగకుండా సిద్దాపూర్ డంపింగ్ యార్డు కు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (రాణపూ జీూజ) పేరుతో కమిటీ ని ఏర్పాటు చేసుకుని ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేసుకుని, ప్రజలను చైతన్యం చేస్తూ, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

జీవో వచ్చి 120 రోజులు అవుతున్నా ఎమ్మెల్యే మాత్రం ప్రజలకు ఎలాంటి బరోసా ఇవ్వకపోవడం శోచనీయం.

జీవో రాక ముందు జరిగిన ఆందోళనకు స్పందించిన ఎమ్మెల్యే డంపింగ్ యార్డు రానివ్వను అని ఆనాడు చెప్పి. తీర ఇప్పుడు జీవో వచ్చాక ఎందుకు నోరు మెదపడం లేదని ప్రజలు అయోమయంలో పడ్డారు. నిజంగా ప్రజల మీద ప్రేమ ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఇప్పుడు జరుగుతున్న ఉద్యమంలో భాగమై జీవో రదయ్యే వరకు ప్రజలతో ఉండి కొట్లాడి విజయం సాధిస్తే ప్రజలే మళ్ళీ వారిభుజాలపై ఉంచుకుని గేలిపిచుకుంటారు కదా? అలా కాకుండా ఇంకా ప్రజలను మోసానికి గురిచేసే విధంగా డంపింగ్ యార్డు రాదు, రానీయ్యను అంటూ లోలోపల ప్రచారాలు సరైనవి కాదేమో? అసెంబ్లీలో డంపింగ్ యార్డు వద్దు అన్నారు అందుకు ప్రజల తరుపున ధన్యవాదాలు తేజపాల్సిందే, ప్రభుత్వ స్పందన లేదు. కానీ డేటా సెంటర్లు ఇవ్వమని అడగటం మళ్ళా పర్యావరణాన్ని దెబ్బతీసే అంశం. కనుక ప్రజల తరుపున ఉద్యమంలో కలసి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. లేకపోతే ప్రజా క్షేత్రంలో దోషులుగా నిలబడక తప్పదు.

సిద్దాపూర్ అంటే పచ్చని పొలాలు... రైతుల జీవనాధారం!

సిద్దాపూర్ కేవలం ఒక గ్రామం కాదు. వ్యవసాయం, కూరగాయల సాగు, పశుపోషణపై ఆధారపడి జీవించే అనేక కుటుంబాల ఆశలు, ఆకాంక్షలకు నిలయం. పచ్చని పొలాలు, పంటలు, పశుసంపద ఈ ప్రాంత గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఆధారం. రైతుల కష్టం, వ్యవసాయ కార్మికుల శ్రమ, పాడి పరిశ్రమ ద్వారా ఎన్నో కుటుంబాలు తమ జీవనాన్ని కొనసాగిస్తున్నాయి. సిద్దాపూర్ చుట్టూ సుమారు 20 తండాలు ఉంటాయి. అక్కడ గిరి పుత్రుల జీవన విధానం. వ్యవసాయంపై వారికున్న మక్కువ ,ప్రేమ అపారం. ఇలాంటి ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు ప్రతిపాదన రావడంతో తమ జీవనోపాధి, పర్యావరణం, ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రభావం పడుతుందేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వ్యర్థాల నిర్వహణలో సరైన శాస్త్రీయ ప్రమాణాలు పాటించకపోతే దుర్వాసన, గాలి కాలుష్యం, భూగర్భజలాల కలుషితం, ఈగలు, దోమల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు సరైనవి కాదు.

120 రోజులు... ప్రజా ఉద్యమం సాగించిన అడుగులు!

జీవో 641పై తమ అభ్యంతరాలను తెలియజేయడానికి సిద్దాపూర్ ప్రజలు, సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (రాణపూ జీూజ) ఆధ్వర్యంలో వివిధ ప్రజాస్వామిక మార్గాల్లో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.

ఎంఆర్ఓ కార్యాలయం వద్ద ధర్నా

డంపింగ్ యార్డు ప్రతిపాదనపై తమ నిరసనను తెలియజేస్తూ, జీవో 641ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్ఓ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. స్థానిక ప్రజల ఆందోళనలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తమ గ్రామ భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

హైదరాబాద్‌లో మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం.

సిద్దాపూర్ సమస్యను ఒక గ్రామానికి పరిమితమైన అంశంగా కాకుండా, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, పట్టణ వ్యర్థాల నిర్వహణ, ప్రజల జీవించే హక్కులకు సంబంధించిన సమస్యగా విస్తృతంగా చర్చించేందుకు హైదరాబాద్‌లో పర్యావరణ వేత్తలు, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ అంశంపై ప్రజా చర్చను విస్తరించడం, నిపుణుల అభిప్రాయాలను ముందుకు తీసుకురావడం, ప్రభుత్వానికి ప్రజల ఆందోళనలను తెలియజేయడం ఈ ప్రయత్నంలో కీలకమైన భాగాలు.

జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు.

సిద్దాపూర్ ప్రాంతంలోని గిరిజన ప్రజల ఆందోళనలు, వారి హక్కులకు సంబంధించిన అంశాలను జాతీయ స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగా జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్‌కు ఫిర్యాదు సమర్పించారు. ప్రభావిత గిరిజన కుటుంబాల సమస్యలను పరిశీలించి, వారి హక్కులకు రక్షణ కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజల సమస్యలు సంబంధిత అధికార యంత్రాంగం దృష్టికి వెళ్లడం, వాటిపై అధికారిక పరిశీలన జరగడం ఈ పోరాటంలో ముఖ్యమైన అంశం.

సిద్దాపూర్‌ను దత్తత తీసుకున్న మహేష్ బాబుకు వినతిపత్రం.

సిద్దాపూర్ గ్రామాన్ని దత్తత తీసుకున్న సినీ నటుడు మహేష్ బాబు దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. సిద్దాపూర్ డంపింగ్ యార్డు ప్రతిపాదనపై ప్రజల ఆందోళనలను వివరిస్తూ వినతిపత్రం సమర్పించారు.

సామాజిక బాధ్యతలో భాగంగా ప్రజల సమస్యలపై స్పందించి, సిద్దాపూర్ ప్రజల ఆందోళనలను సంబంధిత ప్రభుత్వ వర్గాల దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుల సిద్దాపూర్ పర్యటన.

జేఏసీ కృషితో జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు శ్రీ జటోతు హుస్సేన్ నాయక్ సిద్దాపూర్ పర్యటన ఈ సమస్యలో మరో ముఖ్యమైన పరిణామం. గిరిజన ప్రజల ఆందోళనలు, వారి సమస్యలు, జీవో 641కు సంబంధించిన అభ్యంతరాలను కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఈ పర్యటన ద్వారా ఏర్పడింది.

ప్రభావిత ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా పరిశీలించబడటం, వారి అభిప్రాయాలు వినబడటం ప్రజా ఉద్యమానికి ప్రాధాన్యత కలిగించే అంశం. ఈ పర్యటన ప్రజలలో ఒక నమ్మకాన్ని కలిగించింది. ఎట్టి పరిస్థితుల్లో డంపింగ్ యార్డు రానివ్వను అనించెప్పటం ఉద్యమానికి కొత్త ఊపునిచ్చింది అని చెప్పాలి.

సిద్దాపూర్‌లో నిరంతరాయంగా రిలే నిరాహార దీక్షలు.

ప్రజల ఆందోళనలకు పరిష్కారం లభించాలనే డిమాండ్‌తో సిద్దాపూర్ గ్రామంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించి కొనసాగిస్తున్నారు. ఈ నిరహార దీక్షలు ప్రొఫెసర్ హరగోపాల్ హాజరై ప్రారంభించారు. గ్రామ ప్రజలు, ఉద్యమకారులు తమ నిరసనను శాంతియుతంగా వ్యక్తం చేస్తూ జీవో 641 రద్దు కోసం పట్టుదలతో పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.రిలే నిరాహార దీక్షలు అనేవి కేవలం నిరసన కార్యక్రమాలు మాత్రమే కాదు. ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రజాస్వామిక సాధనాలు. తమ గ్రామ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకునే ముందు తమ మాట వినాలని, తమ అభ్యంతరాలకు న్యాయమైన పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. ఈ నిరాహార దీక్షలు నేటికి 29 రోజులు. మొదటి రోజు నుండి ప్రతీ ఆదివారం ఒక రాష్ట్ర ప్రముఖులను తీసుకు రావడం వారి మద్దతు కూడా గట్టటం లో జేఏసి ముందంజలో ఉంది. మొదటి రోజు అక్టోబర్ 4 ఆదివారం నాడు ప్రొఫెసర్ హరగోపాల్, రెండవ ఆదివారం అక్టోబర్ 11 నాడు ప్రొఫెసర్ సతీష్ రెడ్డి, మూడవ ఆదివారం అక్టోబర్ 18 నాడు అరుణోదయ విమలక్క, నాలుగోవ ఆదివారం 25 నాడు పాలమూరు అధ్యక్షతన వేదిక కన్వీనర్ రాఘవా చారి , మధ్యలో ప్రొఫెసర్ విజయ్, వనమాల, మాజీ శాసన సభ్యులు అంజయ్య యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్ , వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా సంఘాల నాయకులు రావడం మద్దతు ఇవ్వడం , ఇలా కార్యక్రమాలు నిర్వహించడం విశేషం. ఈ రిలే నిరాహార దీక్షలకు చుట్టుపక్కల గ్రామాలు కదం తొక్కుతున్నాయి, రోజుకొక గ్రామం పాల్గొని తమ నిరసనను తెలియజేస్తున్నారు. ఎంఆర్ఓ కార్యాలయం నుంచి హైదరాబాద్‌లోని మేధావుల వేదిక వరకు... జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు నుంచి రిలే నిరాహార దీక్షల వరకు... సిద్దాపూర్ ప్రజలు తమ సమస్యను ప్రతి సంబంధిత వేదికపై వినిపించేందుకు ప్రయత్నిస్తున్నారు.

ప్రజల ముందున్న ప్రశ్నలు ఇవే!

ఈ 120 రోజుల సందర్భంలో ప్రభుత్వం, సంబంధిత అధికార యంత్రాంగం సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు అనేకం ఉన్నాయి.

సిద్దాపూర్‌లో ప్రతిపాదించిన డంపింగ్ యార్డు వల్ల పర్యావరణం, ప్రజారోగ్యంపై కలిగే ప్రభావాలను అంచనా వేసేందుకు సమగ్ర అధ్యయనం జరిగిందా?

భూగర్భజలాలు, వ్యవసాయ భూములు, పశుపోషణ, స్థానిక ప్రజల జీవనోపాధిపై ప్రభావాలను శాస్త్రీయంగా పరిశీలించారా?

ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంచారా?

ప్రభావిత గ్రామాల ప్రజలతో బహిరంగ సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను అధికారికంగా నమోదు చేశారా?

గిరిజన ప్రజల అభ్యంతరాలు, హక్కులకు సంబంధించిన అంశాలపై సంబంధిత అధికారులు ఏ చర్యలు తీసుకున్నారు?

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుల పర్యటన అనంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు?

ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని జీవో 641ను పునఃసమీక్షించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందా?

ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ప్రజల పట్ల ప్రభుత్వ బాధ్యత. ప్రజలు కోరుతున్నది కేవలం హామీలు కాదు; తమ సమస్యలపై పారదర్శకమైన పరిశీలన, స్పష్టమైన నిర్ణయం, న్యాయమైన పరిష్కారం.

సిద్దాపూర్ సమస్య... ప్రాంత భవిష్యత్తుతో ముడిపడిన అంశంలి

సిద్దాపూర్ డంపింగ్ యార్డు సమస్యను ఒక్క గ్రామానికి పరిమితమైన అంశంగా చూడలేం. షాద్‌నగర్, రాజేంద్రనగర్, చేవెళ్ల, మహేశ్వరం ప్రాంతాల భవిష్యత్తుతో పాటు హైదరాబాద్ పాత బస్తీ ప్రజల జీవన్మరణ సమస్య. పర్యావరణ సమతుల్యత వంటి అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాలి.పట్టణీకరణ పెరుగుతున్న కొద్దీ వ్యర్థాల నిర్వహణకు శాస్త్రీయమైన పరిష్కారాలు అవసరం. అయితే వ్యర్థాల నిర్వహణ కోసం ఎంపిక చేసే ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, స్థానికుల జీవనోపాధి, చట్టబద్ధమైన అనుమతులు, ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

సిద్దాపూర్ ప్రజలు, రాణపూ జీూజ ప్రభుత్వం ముందు ఉంచుతున్న ప్రధాన డిమాండ్ జీవో 641ను రద్దు చేయాలనేదే. ఈ డిమాండ్‌ను పరిశీలించేటప్పుడు ప్రభుత్వం ప్రజల అభ్యంతరాలను పూర్తిగా వినాలి. పర్యావరణ, ప్రజారోగ్య నివేదికలను బహిరంగపరచాలి. ప్రభావిత గ్రామాల ప్రజలతో సంప్రదింపులు జరపాలి. గిరిజన కుటుంబాల హక్కులకు సంబంధించిన అంశాలను కూడా సమగ్రంగా పరిశీలించాలి.ప్రజల ఆందోళనలను పట్టించుకోకుండా నిర్ణయాలు ముందుకు తీసుకెళ్లడం సమస్యను మరింత సంక్లిష్టం చేయవచ్చు. ప్రజల విశ్వాసాన్ని పొందాలంటే వారి మాట వినడం, వారి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం, వారి అభ్యంతరాలపై న్యాయమైన నిర్ణయం తీసుకోవడం అవసరం.అందువల్ల ప్రభుత్వం వెంటనే స్పందించి, ప్రజల డిమాండ్‌పై స్పష్టమైన వైఖరిని ప్రకటించాలి. ప్రజల హక్కులు, పర్యావరణ పరిరక్షణ, జీవనోపాధికి ప్రాధాన్యతనిస్తూ జీవో 641ను రద్దు చేయాలని సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (SDVP JAC) కోరుతోంది.

ముగింపు: 120 రోజులు గడిచాయి... పోరాటం కొనసాగుతోంది!

జీవో 641కు 120 రోజులు పూర్తవుతున్న ఈ సందర్భం సిద్దాపూర్ ప్రజల పోరాట ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయి. ధర్నాలు నిర్వహించారు. మేధావులతో చర్చించారు. జాతీయ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. గ్రామాన్ని దత్తత తీసుకున్న మహేష్ బాబుకు వినతిపత్రాలు సమర్పించారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుల పర్యటన అనంతరం గ్రామంలో రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తున్నారు. బతుకమ్మ సంబరాలకు కూడా జరుపుతూ.. రాష్ట్రంలో ఉన్న ప్రజాస్వామిక వాదుల మద్దతు కూడగటట్టంలో ముందున్నారు. వచ్చే ఆదివారం అక్టోబర్ 18 నాడు అరుణోదయ విమలక్క ఆధ్వర్యంలో సిద్దాపూర్ గ్రామం బతుకమ్మ సంబరాలలో తేలి ఆడింది.

ఇన్ని ప్రయత్నాల వెనుక ఉన్నది ఒకే ఆకాంక్ష --- తమ గ్రామ భవిష్యత్తును కాపాడుకోవడం, తమ సమస్యలకు న్యాయమైన పరిష్కారం సాధించడం, రాజ్యాంగం కల్పించిన తమ జీవన హక్కుకు భరోసా పొందడం.

ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతు వినిపించాలి. పాలకులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. పర్యావరణ పరిరక్షణ కాగితాలకే పరిమితం కాకూడదు. రైతుల జీవనోపాధి, గిరిజనుల హక్కులు, గ్రామీణ ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ నిర్ణయాల్లో ప్రతిఫలించాలి.

120 రోజులు గడిచాయి... ప్రజల ప్రశ్నలకు సమాధానాలు రావాలి!

120 రోజులు గడిచాయి... సిద్దాపూర్ ప్రజల ఆందోళనకు పరిష్కారం చూపాలి!

120 రోజులు గడిచాయి... జీవో 641 రద్దుపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలి!

మన పోరాటం ఒక గ్రామం కోసమే కాదు --- మన పర్యావరణం కోసం, మన జీవనోపాధి కోసం, మన భవిష్యత్తు కోసం.

మన నినాదం

మన ఊరు -- మన భవిష్యత్తు -- మన హక్కు!

సిద్దాపూర్‌ను కాపాడుకుందాం!

పర్యావరణాన్ని రక్షించుకుందాం!

జీవో 641 రద్దయ్యే వరకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడుదాం!

ప్రశ్నిద్దాం ! పోరాడుదాం !! సాదిదాం !!!

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

నూతన ప్రభుత్వ పాఠశాల వద్ద బోరు మోటర్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్

విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించడమే లక్ష్యం

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జర్నలిస్ట్ డైరీ) : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ శివారులోని హాజిపల్లి గ్రామ పరిధిలో ఉన్న సిండికేట్ కాలనీలో విద్యార్థుల కోసం నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ పాఠశాల భవనం వద్ద ఏర్పాటు చేసిన బోరు మోటర్‌ను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించడం ఎంతో ముఖ్యమని అన్నారు. పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా బోరు మోటర్‌ను ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు. ముఖ్యంగా సంచార జాతుల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తే వారు విద్యలో మరింత రాణించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్, గ్రామ సర్పంచ్ కుమార్, ఉప సర్పంచ్ గంగాధర్, వార్డు సభ్యులు విష్ణు, నిరంజన్, సీనియర్ నాయకులు బాదేపల్లి సిద్ధార్థ, సుదర్శన్, జంగయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళులు

- పూలమాలలు వేసి నివాళులర్పించిన షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, నాయకులు

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జర్నలిస్ట్ డైరీ) : భారతదేశ ఉక్కు మనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి ఉప ప్రధానమంత్రి, భారతదేశ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నివాళులర్పించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పటేల్ రోడ్డులో ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశంలోని వందలాది సంస్థానాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి అఖండ భారతదేశ నిర్మాణంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. దేశ సమగ్రత, సమైక్యత, ఐక్యత కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు నేటి తరానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని తెలిపారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పటేల్ చూపిన మార్గంలో నడుస్తూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కౌన్సిలర్ కొప్పునూరి ప్రవీణ్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, చందులాల్, సింగపాక అనిల్, బాదేపల్లి సిద్ధార్థ, జంగయ్య, రమేష్, సాయికిరణ్, శ్రీధర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీకి బయలుదేరిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. కాంగ్రెస్ ముఖ్య నాయకుల బృందం

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జర్నలిస్ట్ డైరీ) : షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ గారితో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకుల బృందం చలో ఢిల్లీ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లింది. నవంబర్ 1వ తేదీన న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు, ఎస్ఐఆర్ (SIR)కు వ్యతిరేకంగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ నిరసన సభలో పాల్గొనేందుకు ఈ బృందం ఢిల్లీకి పయనమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటంతో పాటు కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇండియా కూటమి చేపట్టిన ఈ పోరాటంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ బృందంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, ఫరూక్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ రఘు నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, లింగారెడ్డిగూడ డిప్యూటీ సర్పంచ్ అశోక్, నాయకులు కే.కే. కృష్ణ, సీతారాం, రాజు తదితరులు ఉన్నారు.

షాద్‌నగర్‌లో మాతా శిశు మరణంపై టీఆర్‌పీ నేత ఎమ్మె సంతోష్ ఆగ్రహం..

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జర్నలిస్ట్ డైరీ) : షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణి రాధా, కడుపులోని శిశువు మృతి చెందిన ఘటనపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మె సంతోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యమే ఈ విషాదానికి కారణమని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొందుర్గ్, షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల తీరుపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. కొందుర్గ్ మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన రాధా ప్రసవ నొప్పులతో తొలుత కొందుర్గ్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా, అక్కడి నుంచి షాద్‌నగర్ ఆసుపత్రికి పంపించారని తెలిపారు. తీవ్ర నొప్పులతో బాధపడుతున్న గర్భిణికి షాద్‌నగర్ ఆసుపత్రిలోనూ సరైన వైద్యం అందలేదని, చివరకు హైదరాబాద్‌కు వెళ్లాలని సూచించడంతో తల్లి, బిడ్డ ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. నెలల తరబడి ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్య పరీక్షలు చేయించుకుంటున్న పేద గర్భిణులకు అత్యవసర ప్రసవ సమయంలో వైద్యం అందకపోతే వారు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్యులు, మందులు, అవసరమైన పరికరాలు అందుబాటులో లేకపోవడం వల్ల పేద ప్రజలు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని విమర్శించారు. కొందుర్గ్ ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస వసతులు కల్పించాలని గతంలోనే నిరాహార దీక్ష చేపట్టామని, తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాదయాత్ర సందర్భంగా కూడా ఆసుపత్రి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తుచేశారు. అయినప్పటికీ పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాధా, ఆమె కడుపులోని శిశువు మృతిపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని, నిర్లక్ష్యానికి కారకులుగా తేలిన కొందుర్గ్, షాద్‌నగర్ ఆసుపత్రుల వైద్య సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల నియామకాలు చేపట్టి, అత్యవసర వైద్య సేవలు, మందులు, చికిత్స పరికరాలు, ఆధునిక యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలే ఇలాంటి ఘటనల్లో ఎక్కువగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పందించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రతిపక్ష నాయకులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్ర నాయకత్వం, తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు షాద్‌నగర్ టీఆర్‌పీ ఆధ్వర్యంలో భారీ ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుల్ల లక్ష్మి, కొందుర్గ్ మండల అధ్యక్షుడు దర్గ వెంకటయ్య, జిల్లా నాయకులు జి. శ్రీనివాసులు, షాద్‌నగర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు రాములు, నియోజకవర్గ నాయకులు గుంటి శంకర్, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు ఆవ జగన్, యాదగిరి, వడ్డే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భార్య, బిడ్డను కోల్పోయి దుఃఖంలో ఉన్న వ్యక్తిపై పోలీసు వేధింపులా..?

ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యానికి బాధ్యత ఎవరిది..?

బాధితుడినే నిందితుడిగా మార్చడం ఏ న్యాయం..?

ప్రభుత్వ ఆసుపత్రికి కాన్పు కోసం వస్తే ఇంత అరాచకమా

వైద్య, పోలీసు శాఖల తీరుపై లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రాంబల్ నాయక్ తీవ్ర ఆగ్రహం

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జర్నలిస్ట్ డైరీ) : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం కోసం వచ్చిన గర్భిణీ రాధ, ఆమె కడుపులోని శిశువు మృతి చెందిన ఘటనపై లంబాడి హక్కుల పోరాట సమితి నాయకుడు ఎం. రాంబల్ నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన సమయంలో, భార్యను, పుట్టబోయే బిడ్డను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న భర్త రమేష్‌ను పోలీసు కేసులతో వేధించడం ఏమిటని ప్రశ్నించారు. ఒకవైపు భార్యను, మరోవైపు కడుపులోని బిడ్డను కోల్పోయి, మరోవైపు తన పిల్లలకు దూరమై తల్లడిల్లుతున్న వ్యక్తి పట్ల వ్యవస్థలు చూపుతున్న తీరు మానవత్వానికే మచ్చ అని మండిపడ్డారు. మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో రాంబల్ నాయక్ మాట్లాడుతూ.. అసలు రమేష్ చేసిన తప్పేమిటని ప్రశ్నించారు. తన భార్యకు ప్రసవం చేయించాలనే ఆశతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడమే అతను చేసిన తప్పా? ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందుతుందని నమ్మి వచ్చిన పేద కుటుంబానికి ఇలాంటి పరిస్థితి ఎదురైతే బాధ్యత ఎవరు వహించాలని నిలదీశారు. వైద్య వ్యవస్థలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న నిర్లక్ష్యంపై విచారణ జరపాల్సింది పోయి, బాధిత కుటుంబానికి అండగా నిలవాల్సిన అధికారులు, పోలీసు కేసుల పేరుతో భర్తను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఒక కుటుంబం మొత్తం విషాదంలో మునిగిపోయిన సమయంలో బాధితుడికి ధైర్యం చెప్పి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ వైద్య, పోలీసు శాఖలపై ఉందని, అలాంటిది బాధితుడినే నిందితుడిగా చిత్రీకరించే ప్రయత్నాలు జరగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వైద్యుల నిర్లక్ష్యంపై సమాధానం చెప్పాల్సిన వ్యవస్థలు తమ బాధ్యత నుంచి తప్పించుకునేందుకు బాధిత కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాయనే అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు నాణ్యమైన వైద్యం అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం జరిగితే దానిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. అదేవిధంగా పోలీసులు కూడా చట్ట పరిధిలో వ్యవహరించాలని, బాధితుడిపై పెట్టినట్లు ఆరోపణలు వస్తున్న కేసుల వివరాలను బహిర్గతం చేసి, వాటి చట్టబద్ధతను పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, బాధిత కుటుంబానికి న్యాయం చేయకుండా, అన్యాయంగా కేసులతో వేధిస్తే చూస్తూ ఊరుకునేది లేదని రాంబల్ నాయక్ హెచ్చరించారు. రమేష్‌పై నమోదైనట్లు చెబుతున్న కేసులపై సమగ్ర పరిశీలన జరపాలని, భార్య, బిడ్డ మృతికి సంబంధించిన వైద్యపరమైన వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు లంబాడి హక్కుల పోరాట సమితి తరఫున పెద్ద ఎత్తున స్పందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

-వైద్య సేవలు, సిబ్బంది హాజరు, ప్రయోగశాల, టీకాల నిల్వలపై పరిశీలన

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జర్నలిస్ట్ డైరీ) : రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి శనివారం మధ్యాహ్నం షాద్‌నగర్ డివిజన్ ఫరూఖ్‌నగర్ మండలంలోని చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, ప్రయోగశాల నిర్వహణ, మందులు, టీకాల నిల్వ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తొలుత హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులును కలిసి ఆసుపత్రిలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టాఫ్ నర్స్ వినీతను కలిసి ఆరోజు వచ్చిన రోగుల సంఖ్య, వారిలో రక్త పరీక్షలకు పంపించిన వారి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ప్రయోగశాలను సందర్శించి ల్యాబ్ టెక్నీషియన్ అశోక్ నిర్వహిస్తున్న పరీక్షలు, రికార్డులు, ప్రయోగశాల రిజిస్టర్లను పరిశీలించారు. క్షయ వ్యాధి నిర్ధారణకు కఫ పరీక్షలు నిర్వహిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఫార్మసిస్ట్ పర్వతాలుతో కలిసి గర్భిణులు, చిన్నారులకు అందించే టీకాల నిల్వ విధానాన్ని పరిశీలించారు. ఐఎల్‌ఆర్ పరికరంలో టీకాలను భద్రపరిచే విధానం, కోల్డ్ చైన్ నిర్వహణ, ఉష్ణోగ్రతల నమోదు రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్యాలయంలో సిబ్బంది హాజరు, విధుల నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి, ఈ వారానికి సంబంధించిన పర్యటన వివరాలను మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో వెంటనే నవీకరించాలని సూచించారు. విధులకు గైర్హాజరైన కాంట్రాక్టు డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్టాఫ్ నర్స్ వినీతకు సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ తనిఖీలో రంగారెడ్డి జిల్లా డీపీఓ అక్రమ్, డీఎంఎంహెచ్‌ఓ సీసీ సురేష్, చించోడు ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, హెల్త్ సూపర్వైజర్ శ్రీరామ, ఫార్మసిస్ట్ పర్వతాలు, స్టాఫ్ నర్స్ వినీత, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, కంటింజెంట్ వర్కర్ మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీ స్త్రీ మరియు శిశు మరణానికి కారణమైన డాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలి..

-కేసును తప్పుదారి పట్టిస్తే హైకోర్టుకు ఈడుస్తాం!

-షాద్‌నగర్ గర్భిణీ శిశువు ఘటనపై భగ్గుమన్న బహుజన్ సమాజ్ పార్టీ

-పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాలి.. బాధితుడి అరెస్టు దుర్మార్గం

-నిందితులను కాపాడేందుకు వ్యవస్థల కుమ్మక్కుపై న్యాయపోరాటం చేస్తాం

-బీఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ తీవ్ర హెచ్చరిక

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జర్నలిస్ట్ డైరీ)
-షాద్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో వైద్యుల ఘోర నిర్లక్ష్యం కారణంగా నిండు గర్భిణి రాధా, ఆమె కడుపులోని శిశువు ప్రాణాలు కోల్పోయిన ఉదంతంపై -బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ దారుణ ఘటనకు పూర్తి బాధ్యులైన ఆసుపత్రి వైద్య సిబ్బందిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు -చేయాలని బీఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని, పోలీసు యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. డెలివరీ కోసం వచ్చిన నిరుపేద మహిళ ప్రాణాలను -నిర్లక్ష్యంతో పొట్టనబెట్టుకోవడమే కాకుండా, ఈ కేసును పక్కదోవ పట్టించేలా అధికారులు కుట్రలు పన్నుతున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

పోలీసులు సుమోటోగా చర్యలు తీసుకోవాలి:
ఈ సందర్భంగా దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో సురక్షిత ప్రసవం జరుగుతుందనే ఆశతో వచ్చిన ఒక దళిత, నిరుపేద కుటుంబానికి వైద్యులు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 11 గంటలకు ఆసుపత్రికి వస్తే సాయంత్రం దాకా సాధారణ కాన్పు అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరించి, ప్రాణాలు పోయాక నాటకాలడటం దారుణమని మండిపడ్డారు. ఈ వ్యవహారంలో పోలీసులు తక్షణమే సుమోటోగా (Suo Motu) స్పందించి, బాధ్యులైన డ్యూటీ డాక్టర్లపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

కేసును తప్పుదారి పట్టిస్తే హైకోర్టులో తేల్చుకుంటాం!
వైద్యుల నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి అధికారులు అబద్ధపు ప్రెస్ నోట్లు విడుదల చేయడం, మరోవైపు భార్యను, పుట్టబోయే బిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న భర్త రమేష్ ను అదుపులోకి తీసుకుని పాత గొడవలను తెరపైకి తేవడం అత్యంత హేయమైన చర్య అని ఆయన మండిపడ్డారు. ఆసుపత్రి యాజమాన్యాన్ని కాపాడేందుకు పోలీసులు, సంబంధిత అధికారులు కేసును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. న్యాయం కోసం నిలబడే బాధితుల పక్షాన బీఎస్పీ పోరాడుతుందని, అధికారుల నిర్లక్ష్య వైఖరిపై అవసరమైతే తెలంగాణ హైకోర్టు గడప తొక్కుతామని, బాధ్యులైన ప్రతి ఒక్కరినీ కోర్టు బోనులో నిలబెడతామని హెచ్చరించారు.

బాధితులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం:
తల్లి లేని ఆ ఇద్దరు పసిపాపల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ప్రభుత్వం తక్షణమే బాధిత కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని దొడ్డి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నిర్లక్ష్యానికి కారణమైన సూపరింటెండెంట్ సహా డ్యూటీలో ఉన్న ఐదుగురు వైద్యులను వెంటనే విధుల్లోంచి తొలగించి జైలుకు పంపాలని, లేనిపక్షంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రజా ఆందోళనలను తీవ్రతరం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఓటు హక్కు పరిరక్షణకు ఏఐఎస్ఎఫ్ నిరసన ర్యాలీ

- ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి.. సీఈసీ రాజీనామా చేయాలి

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జర్నలిస్ట్ డైరీ) :
రాజ్యాంగం కల్పించిన పౌరుల ఓటు హక్కును హరించేలా కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ సమితి డిమాండ్ చేసింది. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఎన్నికల సంఘం విఫలమైందని ఆరోపిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని కోరింది. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు కళ్లకు నల్లబ్యాండ్లు ధరించి, చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని అంబేద్కర్ ముఖ్య కూడలి నుంచి మహనీయుల విగ్రహాల వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ దేశంలో 140 కోట్ల జనాభాలో 13 కోట్ల మంది ఓటు హక్కును తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పేదలు, దళితులు, గిరిజనులు, మైనార్టీల ఓటు హక్కుకు భంగం కలిగించేలా ఎస్ఐఆర్ ప్రక్రియ సాగుతోందని విమర్శించారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, దానిని పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ప్రజాస్వామ్యం అమ్మకానికి లేదని, ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయకపోతే దేశవ్యాప్తంగా విద్యార్థి, యువజన ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఫరూక్‌నగర్ మండల కార్యదర్శి అనిల్ నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సాయి చౌహాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థి నాయకులు నరేష్, శ్రీహరి, రాజేష్, రాకేష్, రాఘవేందర్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

రూ. 13 కోట్ల 82 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆరెకపూడి గాంధీ

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జర్నలిస్ట్ డైరీ) :
మియాపూర్ డివిజన్ పరిధిలోని బీకే ఎన్ క్లేవ్ , మయూరి నగర్, నడిగడ్డ తండా, ఎస్ఎంఆర్ హై ల్యాండ్ అపార్ట్మెంట్, శ్రీల గార్డెన్ న్యూ కాలనీ,శ్రీ లక్ష్మీ నగర్ కాలనీలలో రూ. 13 కోట్ల 82 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు, వరద నీటి కాల్వ నిర్మాణం పనులకు తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గం మరియు కాలనీల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం మియాపూర్ డివిజన్ పరిధిలోని బీకే ఎన్ క్లేవ్ , మయూరి నగర్, నడిగడ్డ తండా, ఏసెమార్ హై ల్యాండ్ అపార్ట్మెంట్, శ్రీల గార్డెన్ న్యూ కాలనీ,శ్రీ లక్ష్మీ నగర్ కాలనీలలో రూ. 13 కోట్ల 82 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు, మరియు వరద నీటి కాల్వ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగినది అని, సీసీ రోడ్ల పనులు మరియు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, కాలనీల వాసులకు నేటితో ఉపశమనం లభించింది అని తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని , శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అగ్రభాగాన నిలబెడుతామని తెలిపారు.
సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన , అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని తెలియచేసారు. అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని , నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని ప్రజలకు ట్రాఫిక్ రహిత , సుఖవంతమైన , మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని,అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని అదేవిధంగా వరద నీటి కాల్వ నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, వర్షపు నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని అధికారులకు చెప్పడం జరిగినది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించడం జరిగినది , ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని , ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని చెప్పడం జరిగినది. అదేవిధంగా పార్కు లను సుందర శోభిత వనంలు గా తీర్చిదిద్దుతామని , కాలనీ వాసులకు చక్కటి ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తామని, పార్క్ లో వాకింగ్ చేసేవారికి, వృద్ధులు సేదతీరడానికి, పిల్లలకు ఆటవిడుపు గా పార్క్ లను తీర్చిదిద్దుతామని

తెలియచేశారు.శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని , మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, మియాపూర్ డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పునరుద్ఘాటించారు.

శంకుస్థాపన చేసిన కార్యక్రమాలరూపాయలు వివరాలు :
మంజూరైన అభివృధి పనుల వివరాలు
1.) బొల్లారం మెయిన్ రోడ్ లో గల టాటా మోటార్స్ నుండి మీది కుంట చెరువు వరకు రూ. 1 ఒక్క కోటి 75 డెబ్బై ఐదు లక్షల రూపాయలు అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే (బాక్స్ డ్రైన్) వరద నీటి కాలువ నిర్మాణం పనులకు.
2).మయూరి నగర్ కాలనీలో వాసిరెడ్డి స్వీట్ హౌస్ నుండి లక్ష్మీ సఫైర్ అపార్ట్మెంట్స్ వరకు రూ. 1.ఒక్క కోటి 99 తొంబై లక్షల రూపాయల అంచన వ్యయంతో నూతనంగా చేపట్టబోయే బీటీ రోడ్డు నిర్మాణం పనులకు.
3).మయూరి నగర్ కాలనీలో రూ. 1 ఒక్క కోటి 78 డెబ్బై ఎనిమిది లక్షల రూపాయల అంచనా వ్యయంతో దివి రెసిడెన్సి నుండి దివ్యశ్రీ అపార్ట్మెంట్స్ వరకు నూతనంగా చేపట్టబోయే (బాక్స్ డ్రైన్) వరద నీటి కాలువ నిర్మాణం పనులకు.
4) నడిగడ్డ తండా కాలనీ లో రోడ్డ్ నెంబర్ 2.లో 32. ముప్పై రెండు లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సి సి రోడ్డు నిర్మాణం పనులకు.
5). నడిగడ్డ తండా కాలనీ లో రోడ్డ్ నెంబర్ 3.లో 34. ముప్పై నాలుగు లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సి సి రోడ్డు నిర్మాణం పనులకు.
6). నడిగడ్డ తండా కాలనీ లో రోడ్డ్ నెంబర్ 10.లో 36. ముప్పై ఆరు లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సి సి రోడ్డు నిర్మాణం పనులకు.
7). హైటెన్షన్ లైన్ రోడ్డు లో రూ. 199.00 ఒక కోటి తొంబై తొమ్మిది లక్షల రూపాయల అంచనా వ్యయంతో ావీ= హైలాండ్ అపార్ట్మెంట్ నుండి నడిగడ్డ తాండ వరకు నూతనంగా చేపట్టబోయే (బాక్స్ డ్రైన్) వరద నీటి కాలువ నిర్మాణం పనులకు.
8). న్యూ కాలనీ నుండి రాజ్ దర్బార్ రెస్టారెంట్ వరకు రూ. 2 రెండు కోట్ల 50 యాబై లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే (బాక్స్ డ్రైన్) వరద నీటి కాలువ నిర్మాణం పనులకు.
9). శ్రీ లక్ష్మీ నగర్ కాలనీలో రూ. 39 ముప్పై తొమ్మిది రూపాయల అంచనా వ్యయంతో పాడైన సిసి రోడ్ల పునరుద్ధరణ పనుల కోరకు.
10). శ్రీల గార్డెన్ కాలనీలలో రూ 46 నలభై ఆరు లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే సి,సి రోడ్ల నిర్మాణం పనులనుకు.
11).మయూరి నగర్ కాలనీ లో రూ.32 ముప్పై రెండు లక్షల రూపాయల అంచనావ్యయంతో ఎస్బిఐ బ్యాంకు నుండి మందారం అపార్ట్మెంట్ వరకు నూతనంగా చేపట్టబోయే సి,సి రోడ్డు నిర్మాణం పనులనుకు.
12). శ్రీ లక్ష్మీ నగర్ కాలనీలో రూ. 22 ఇరవై రెండు లక్షల రూపాయల అంచనా వ్యయంతో శ్రీజ మెట్రో హోమ్స్ నుండి రాజశ్రీ హోమ్స్ వరకు నూతనంగా చేపట్టబోయే 450 డయ పైప్ లైన్ నిర్మాణం పనులకు.
13). మయూరి నగర్ కాలనీలో కేంద్రీయ విహార్ నుండి ఓల్డ్ ఏజ్ హోమ్ వరకు రూ. 1ఒక్క కోటి 40 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే ఫుట్ పాత్ నిర్మాణం పనులకు.
పైన పేర్కొన్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగినది అని తెలియచేసారు.
ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, మహిళా సోదరీమణులు , కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం.

బుద్ధుల జంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి.

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జర్నలిస్ట్ డైరీ) :
కార్మిక హక్కులను కాలరాస్తూ బడా పెట్టుబడిదారులైన ఆదాన్ని అంబానీ బడ పారిశ్రామికవేతులకు ఉడియం చేస్తుంది కేంద్ర బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం అని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బి కే ఎం యు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య ఆరోపించారు కొందుర్గు మండలం కేంద్రంతో పాటు రామచంద్రపూర్ చౌరస్తాలో ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవానికి ముఖ్య తిధి గా విచ్చేసి జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడుతూ అట్టడుగు కార్మిక వర్గాలైన గ్రామపంచాయతీ కార్మికులు ఆశ వర్కర్ అంగన్వాడీలు మధ్యాహ్న భోజన కార్మికులు తదితర రంగాలకు కనీస వేతనం లేదు పిఎఫ్ లేదు ఈఎస్ఐ లేదు ఇన్సూరెన్స్ సౌకర్యం లేదు వారితో వ్యక్తి చాకిరి చేయించుకుని అంగన్వాడీలు రిటైర్మెంట్ అయిన తర్వాత కనీస పెన్షన్ సౌకర్యాన్ని కూడా నోచుకోలేని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు 44 లేబర్ చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించి అమలుపరుస్తుంది కేంద్ర ప్రభుత్వమన్నారు సంఘం పెట్టుకునే హక్కును కూడా లేకుండా చేసి ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని ప్రైవేటుపరం చేసి ఇదే అభివృద్ధి అని గొప్పలు చెప్పుకుంటున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం అని దుయ్యబట్టారు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు సిద్ధంగా వలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా కార్మిక లోకానికి పిలుపునిచ్చారు రాజ్యాంగాన్ని రక్షించుకుందాం దేశాన్ని కాపాడుకుందాం హక్కులకై ఉద్యమిద్దమని నినదించారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి భాగాల నరసింహ జిపి వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు జి యాదయ్య ప్రధాన కార్యదర్శి పామిడి జంగయ్య కార్యనిర్వాహక కార్యదర్శి సి జంగయ్య కోశాధికారి ఎం శ్రీను నాయకులు గౌరవ అధ్యక్షులుయాదయ్య రాములు జంగమ్మ చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘట్కేసర్ మున్సిపాలిటీలో ఘనంగా ఏఐటియుసి 107 వ్యవస్తాపక దినోత్సవం...

నాగారం, అక్టోబర్ 31:- (జర్నలిస్ట్ డైరీ) మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఘటకేసర్ మునిసిపల్ కార్యాలయంలో ఏఐటియుసి 107వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కామ్రేడ్ సువర్ణ ఏఐటియుసి జెండాను ఆవిష్కరించారు. శనివారం ఈ కార్యక్రమాన్ని కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఏఐటియుసి రాష్ట్ర నాయకులు కల్లూరి జై చంద్ర హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఘట్కేసర్ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, సిపిఐ మండల సాయి కార్యదర్శి సయ్యద్ ఖదీర్, మున్సిపల్ నాయకులు జి రామచంద్ర, రామ్ కుమార్, మండల నాయకులు చౌదరి, బాల నరసింహ రామ్, కుమార్, అరుణ, శోభ, భోపాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య నగర్ కాలనీ లో బస్తీ దవాఖాన మరియు అంగన్వాడీ కేంద్రం ను ఏర్పాటు చేయాలని ఆదిత్య నగర్ కాలనీ వాసుల వినతి.

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జర్నలిస్ట్ డైరీ) : మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్ కాలనీ లో బస్తీ దవాఖాన మరియు అంగన్వాడీ కేంద్రం ను ఏర్పాటు చేయాలని ఆదిత్య నగర్ కాలనీ వాసులు సీనియర్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పియేసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ ని వివేకానంద నగర్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగినది. ఈ సందర్భంగా ఆదిత్య నగర్ కాలనీ వాసులు మాట్లాడుతూ మా కాలనీ అభివృద్ధికి విశేష కృషి చేశారు అని, కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగినది అని, మీకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం అని , అదేవిధంగా కాలనీ లో పేద మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా నివసిస్తున్నారు అని, వారికి మెరుగైన వైద్యం కోసం మరియు అందరికీ అందుబాటులో ఉండే విధంగా బస్తీ దవాఖాన ను. నిర్మించాలని మరియు అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు కోసం కృషి చేయాలని, తమ వంతు సహాయ సహకారాలు ఉండాలని గాంధీ కి వినతిపత్రం ద్వారా తెలియచేయడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదిత్య నగర్ కాలనీ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని, ఆదిత్య నగర్ కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని, ఆదిత్య నగర్ కాలనీ అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని, ఆదిత్య నగర్ కాలనీ లో పేద మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా నివసిస్తున్నారు అని, వారికి మెరుగైన వైద్యం కోసం మరియు అందరికీ అందుబాటులో ఉండే విధంగా బస్తీ దవాఖాన ను. నిర్మిస్తామని మరియు చిన్న పిల్లల చదువు కోసం అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తామని,బస్తీధవఖాన నిర్మాణం కోసం నా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని, ఆదిత్య నగర్ కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని తెలియచేశారు ఆదిత్య నగర్ మరియు మాదాపూర్ డివిజన్ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తామని తెలియచేశారు .

ఈ కార్యక్రమంలో ఆదిత్య నగర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 3 కోట్ల 06 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆరెకపూడి గాంధీ

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జర్నలిస్ట్ డైరీ) : కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ బి బ్లాక్, మార్తాండ్ నగర్, గోల్డెన్ తులిప్, మాధవ హిల్స్ ఫేజ్ 1 కాలనీలలో రూ.3 కోట్ల 6 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు మరియు వరద నీటి కాల్వ నిర్మాణం పనులకు తాజా మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ... మాట్లాడుతూ ప్రజల సంక్షేమం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గం మరియు కాలనీల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ బి బ్లాక్, మార్తాండ్ నగర్, గోల్డెన్ తులిప్, మాధవ హిల్స్ ఫేజ్ 1 కాలనీలలో రూ.3 కోట్ల 6 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు మరియు వరద నీటి కాల్వ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగినది అని, సీసీ రోడ్ల పనులు మరియు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, కాలనీల వాసులకు నేటితో ఉపశమనం లభించింది అని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని , శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అగ్రభాగాన నిలబెడుతామని తెలిపారు.

సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన , అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని తెలియచేసారు. అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని , నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని ప్రజలకు ట్రాఫిక్ రహిత , సుఖవంతమైన , మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని,అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని అదేవిధంగా వరద నీటి కాల్వ నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, వర్షపు నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని అధికారులకు చెప్పడం జరిగినది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించడం జరిగినది , ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని , ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని చెప్పడం జరిగినది. అదేవిధంగా పార్కు లను సుందర శోభిత వనంలు గా తీర్చిదిద్దుతామని , కాలనీ వాసులకు చక్కటి ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తామని, పార్క్ లో వాకింగ్ చేసేవారికి, వృద్ధులు సేదతీరడానికి, పిల్లలకు ఆటవిడుపు గా పార్క్ లను తీర్చిదిద్దుతామని తెలియచేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని , అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, కొండాపూర్ డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పునరుద్ఘాటించారు.

శంకుస్థాపన చేసిన కార్యక్రమాలరూపాయలు వివరాలు :

మంజూరైన అభివృధి పనుల వివరాలు

1.) ప్రేమ్ నగర్ బీ బ్లాక్ కాలనీ లో రూ.2 కోట్ల రూపాయలు అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే (బాక్స్ డ్రైన్) వరద నీటి కాలువ నిర్మాణం పనులకు.

2).మార్తాండ్ నగర్ కాలనీలో రూ. 46 లక్షల రూపాయల అంచన వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణం పనులకు.

3).గోల్డెన్ తులిప్ కాలనీలో రూ. 35 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణం పనులకు.

4) మాధవ హిల్స్ కాలనీ లో రూ.25 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సి సి రోడ్డు నిర్మాణం పనులకు.

పైన పేర్కొన్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగినది అని తెలియచేసారు.

ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, మహిళా సోదరీమణులు , కాలనీల అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఏ ఎస్ రావు వర్ధంతి....

నాగారం, అక్టోబర్ 31:-(జర్నలిస్ట్ డైరీ) ఈసిఐఎల్ వ్యవస్థాపకులు, ప్రముఖ సైంటిస్ట్, మానవతా వాది, ఈసిఐఎల్ ప్రాంత అభివృద్ధికి ఆద్యులు పద్మ భూషణ్ స్వర్గీయ డా. ఏ.ఎస్ రావు వర్ధంతి సందర్భంగా ఈ రోజు డా . ఏ.ఎస్. రావు నగర్ లోని వారి విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాసం మహిపాల్ రెడ్డి, ఎస్.ఎ. రహీమ్, మాట్ల గిరి, ఆనంద్, బేతల బాలరాజు, భాస్కర్, సూరి, ఎం.పి దాస్, సత్యనారాయణ, సాయి రెడ్డి మరియు డా. ఎ. ఎస్. రావు నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరగాంధీ వర్ధంతి వేడుకలు

నాగారం, అక్టోబర్ 31:-(జర్నలిస్ట్ డైరీ) ఉప్పల్ లో స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరగాంధీ వర్ధంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.

ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా ఇందిర గాంధీ విగ్రహం వద్ద వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొపన్నపల్లి సుధాకర్ రెడ్డి, బజారు జగన్నాథ్ గౌడ్, జలీల్ పాషా, ఉప్పల్, హబ్సిగూడ, రామంతాపూర్, వెంకటరెడ్డి నగర్, హెచ్ఎంటి, మల్లాపూర్, శక్తి సాయి నగర్, చిలకనగర్, డివిజన్ అధ్యక్షులు ఈగ ఆంజనేయులు ముదిరాజ్, అకిటి ఆగంరెడ్డి, నల్లవెల్లి మహేంద్ర ముదిరాజ్, కంది శ్రావణ్ రెడ్డి, నామ్ రాజిరెడ్డి, జమీల బేగం, మహేష్ యాదవ్, ఎస్సి కిట్టు, మరియు బ్లాక్ మహిళా అధ్యక్షురాలు అమరేశ్వరి, లింగంపల్లి రామకృష్ణ, ఎండి రఫీక్, గణేష్ నాయక్, అశ్వద్ధామ రెడ్డి, సాయి కిరణ్ గౌడ్, రాజేష్ ముదిరాజ్, బాలరాజు గౌడ్, తుమ్మల దేవి రెడ్డి, వల్లపు శ్రీకాంత్ యాదవ్, ఖాజా భాయ్, ప్యాట మురళి ముదిరాజ్, బొక్క సురేష్ , బొట్టు రాజేష్, గంగపుత్ర భాస్కర్, శ్రీనివాస్ రెడ్డి,అలుగుల అనీల్ , సల్ల ప్రభాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, గొరిగే మహేష్, కృష్ణారెడ్డి, రామ్ రెడ్డి, శ్రీహరి, పూజారి హనుమంతు, మాశెట్టి రాఘవేంద్ర, సుమన్ కృష్ణారెడ్డి, కుమార్,జనగాం రామకృష్ణ, సుధాకర్, తుమ్మల రాజేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి,అన్వార్ పాషా, ఆఫ్జల్ భాయ్, సతీష్ ముదిరాజ్, విజయ్ కుమార్, సత్యనారాయణ, తోకటరాజు, బజార్ నవీన్ గౌడ్, మోహన్ నాయక్, నాగూర్ భాష, మూలాన, బాలరాజ్,రాజన్న,రాజి రెడ్డి, నాగేశ్వర్ రావు, సుధాకర్,ముత్యాల జంగయ్య , చింటూ, అరుణ్ సాయి,సంధ్యా రాణి, అంబిక, సత్తన్న, భాస్కర్, షాగా శ్రీధర్, కా ప్రశాంత్ రెడ్డి, వాసు నాయక్, చింతకింది శ్రీనివాస్, సురేష్ యాదవ్, ఎంబి రాఘవేంద్ర ప్రసాద్, అజీజుద్దీన్, సాయికుమార్, బాబురావు, సాయికిరణ్, నందన్ రాజ్, మహేందర్, శంకర్, అస్లం, ముక్తార్ సుభారెడ్డి, రాజేందర్ రెడ్డి, కిరణ్ , శంకర్ , శ్రీరాములు, సందీప్ భూషత్, తూర్పాటి జంగయ్య , జగదీష్, రాము గౌడ్ , పల్లె రమేష్, శేఖర్ పిట్టల సాయిలు , సోను గౌడ్, నవాబ్, బాబు, ఫహీమ్, సురేందర్, ఈశ్వరి, గీత, విజయ, శోభ, సమత, జంగయ్య, డివిజన్ యూత్, కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ, మహిళా కాంగ్రెస్, ఎస్సి సెల్, బి.సి. సెల్ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినిపై విద్యుత్ రంపంతో దాడి.. బాధితురాలిని పరామర్శించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

-రాప్తాడులో క్లాస్‌రూమ్‌లో విద్యార్థినిపై రంపంతో దాడి

-ఆసుపత్రిలో బాధితురాలిని పరామర్శించిన పరిటాల సునీత

-ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా

రాప్తాడు,అనంతపురం జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : అనంతపురం జిల్లా రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటు చేసుకున్న దారుణ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. పదో తరగతి విద్యార్థినిపై క్లాస్‌రూమ్ లోనే విద్యుత్ రంపంతో దాడి చేసిన నిందితుడిని పోలీసులు గంటల వ్యవధిలోనే అరెస్ట్ చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉంది. ఆమెకు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

బాధితురాలిని పరామర్శించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

ఘటన గురించి తెలిసిన వెంటనే రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధితురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిందితుడిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని, కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు

చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి

ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. “రాప్తాడు స్కూల్‌లో చిన్నారిపై జరిగిన కిరాతక దాడి నన్ను తీవ్రంగా కలచివేసింది. నిందితుడిని పట్టుకుని అత్యంత కఠినమైన శిక్ష పడేలా చూడాలని పోలీసులను ఆదేశించాను” అని ఆయన తెలిపారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని తాను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

తరగతి గదిలోకి ప్రవేశించి ఘాతుకానికి పాల్పడిన నిందితుడు

ఈ ఉదయం తరగతి గదిలో పాఠం జరుగుతుండగా నిందితుడు లోపలికి ప్రవేశించి తరగతి గదిలో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. అతడిని అడ్డుకోబోయిన మరో విద్యార్థినికి కూడా గాయాలయ్యాయి. దాడికి గల కారణాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు

ఉన్మాది దాడిలో గాయపడిన విద్యార్థినిని బెంగుళూరు తరలింపు.. గ్రీన్ చానల్ ఏర్పాటుకు లోకేశ్ చొరవ

-ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని

మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలింపు

-మంత్రి నారా లోకేశ్ చొరవతో మెరుగైన వైద్యం ఏర్పాట్లు

-బెంగళూరు మణిపాల్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడిన లోకేశ్

-గ్రీన్ ఛానల్ కోసం కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు

-అధికారులు, వైద్యులతో ఎప్పటికప్పుడు సమీక్ష

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : అనంతపురం జిల్లా రాప్తాడు లోని జడ్పీ హైస్కూల్‌లో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన పదో తరగతి విద్యార్థినిని మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో ఈ ఏర్పాట్లు చకచకా జరిగాయి. బాలికను బెంగళూరులోని ప్రఖ్యాత మణిపాల్ ఆస్పత్రిలో చేర్పించి, అత్యుత్తమ వైద్యం అందించాలని మంత్రి ఆదేశించారు.

వెంటనే స్పందించిన మంత్రి లోకేశ్

విషయం తెలిసిన వెంటనే స్పందించిన మంత్రి లోకేశ్, విద్యార్థినిని బెంగళూరు తరలించడానికి ముందే మణిపాల్ ఆసుపత్రికి చెందిన ఉన్నతస్థాయి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని వివరించి, సాధ్యమైనంత ఉత్తమమైన చికిత్స అందించాలని వారిని కోరారు. అంతేకాకుండా, అంబులెన్స్ వేగంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా ఆసుత్రికి చేరుకునేందుకు వీలుగా గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయాలని కర్ణాటక ప్రభుత్వంతో మంత్రి లోకేశ్ నేరుగా సంప్రదింపులు జరిపారు.

పోలీసు, విద్య, జిల్లా అధికార యంత్రాంగాలను అప్రమత్తం

దాడి ఘటన తెలిసిన క్షణం నుంచే మంత్రి లోకేశ్.. పోలీసు, విద్య, జిల్లా అధికార యంత్రాంగాలను అప్రమత్తం చేశారు. ప్రతిక్షణం అధికారులతో మాట్లాడుతూ పరిస్థితిని సమీక్షించారు. బాధితురాలికి మెరుగైన వైద్య సహాయం అందించడమే ఏకైక లక్ష్యంగా జిల్లా యంత్రాంగం, వైద్యులతో సమన్వయం చేసుకుంటూ బెంగళూరు తరలింపు ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు

ఏపీలో నేడే 'మున్సిపల్ ఎన్నికల' 'పోలింగ్'.. సర్వం సిద్ధం..

ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలతో నిఘా

-ఆంధ్రప్రదేశ్‌లో పుర, నగర పాలక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

-36,351 మంది పోలీసులతో చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ బందోబస్తు

-సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు లేదా వెబ్‌కాస్టింగ్

-ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న 75 వేల మంది పోలింగ్ సిబ్బంది

-ఓటర్లు ఎలాంటి భయం లేకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఈసీ పిలుపు

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : ఆంధ్రప్రదేశ్‌లో పురపాలక, నగర పాలక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అనిల్ పునేఠా వెల్లడించారు.సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రతి పోలింగ్ కేంద్రాన్ని కెమెరాల నిఘా పరిధిలోకి తీసుకొచ్చామని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ఏర్పాట్లపై ఆయన మీడియా సమావేశంలో పూర్తి వివరాలు అందించారు.

36 వేల మంది పోలీసులతో పటిష్ఠ భద్రత

రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా స్థానిక ఎన్నికల కోసం 36,351 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాలను హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్, నార్మల్‌గా వర్గీకరించారు. హైపర్ సెన్సిటివ్ కేంద్రాల్లో 1+4 (ఒక అధికారి, నలుగురు సిబ్బంది), సెన్సిటివ్ కేంద్రాల్లో 1 3 పద్ధతిలో భద్రత కల్పిస్తున్నారు.

రూట్ మొబైల్స్ ఏర్పాటు

బ్యాలెట్ బాక్సుల తరలింపు, భద్రత కోసం 1,543 రూట్ మొబైల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటితో పాటు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా తక్షణమే స్పందించేందుకు డీఎస్పీ, అదనపు ఎస్పీల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్సులు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులను అందుబాటులో ఉంచారు. పల్నాడు వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ఏపీ స్పెషల్ పోలీస్‌కు చెందిన 130 ప్లటూన్లను మోహరించారు. డీజీపీ కార్యాలయం నుంచి పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని, క్విక్ రియాక్షన్ బృందాలు కూడా సిద్ధంగా ఉన్నాయని పునేఠా వివరించారు.

సుప్రీం ఆదేశాలతో సంపూర్ణ నిఘా

ఎన్నికల ప్రక్రియపై పూర్తి స్థాయిలో నిఘా ఉంచాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేస్తున్నామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఇప్పటికే 6,600 పోలింగ్ లొకేషన్లలో 12,000 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 5,500 సమస్యాత్మక (సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, క్రిటికల్) కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పోలింగ్ కేంద్రం లోపల, బయట జరిగే ప్రతి కదలిక రికార్డు

కెమెరాలు లేని చోట్ల వీడియోగ్రఫీ, అది కూడా సాధ్యం కాని మారుమూల ప్రాంతాల్లో ల్యాప్‌టాప్‌ల ద్వారా వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రం లోపల, బయట జరిగే ప్రతి కదలికను రికార్డు చేస్తామని అధికారులు తెలిపారు. కోర్టు ఆదేశాలు చివరి నిమిషంలో వచ్చినా, సాధ్యమైనంత వరకు అన్ని కేంద్రాలను నిఘా పరిధిలోకి తెచ్చేందుకు కట్టుబడి ఉన్నామని పునేఠా పేర్కొన్నారు.

ఎన్నికల బరిలో 9,642 మంది అభ్యర్థులు

బరిలో 9,642 మంది అభ్యర్థులు.. 75 వేల సిబ్బంది

రాష్ట్రంలోని 13 కార్పొరేషన్లు, 70 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. కార్పొరేషన్ మేయర్/చైర్‌పర్సన్ పదవులకు 153 మంది, మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులకు 367 మంది పోటీలో ఉన్నారు. కార్పొరేషన్లలోని 922 వార్డులకు 3,773 మంది, మున్సిపాలిటీ ల్లోని 2,382 వార్డులకు 6,669 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం వివరాలను మీడియాకు వెల్లడి

మొత్తం మీద వార్డు పదవుల కోసం 9,642 మంది పోటీ పడుతున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు దాదాపు 75 వేల మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. పోలింగ్ సిబ్బంది ఇప్పటికే డిస్పాచ్ కేంద్రాల నుంచి తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బయలుదేరారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం వివరాలను మీడియాకు వెల్లడిస్తామని ఎస్ఈసీ తెలిపింది.

ప్రశాంత వాతావరణానికి సహకరించండి

పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచాల్సిన అవసరం ఉందని ఎస్ఈసీ అనిల్ పునేఠా అభిప్రాయపడ్డారు. ఓటర్లలో చైతన్యం పెంచేందుకు మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించామన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని ఆయన కోరారు. కాగా, రాష్ట్రంలోని 8 మున్సిపాలిటీలు (పిడుగురాళ్ల, గుడిజాల, దాచేపల్లి, దార్సి, పలమనేరు, ప్రొద్దుటూరు, రాయచోటి, కమలాపురం) ఏకగ్రీవం అయినందున అక్కడ ఎన్నికలు జరగడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎక్కువ కాలం అమల్లో ఉంటే అభివృద్ధి పనులు కుంటుపడతాయని, అందుకే ఈ ప్రక్రియను త్వరగా ముగించడం అందరికీ శ్రేయస్కరమని పునేఠా పేర్కొన్నారు

కడప, పులివెందులలో కూటమి నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారు.. అవినాశ్ రెడ్డి

-వైసీపీ ఓటర్లను ఇంటింటికీ వెళ్లి బెదిరిస్తున్నారని అవినాశ్ ఆరోపణ

-అక్రమాలపై ఎలక్షన్ పిటిషన్లతో కోర్టుకు వెళతామని హెచ్చరిక

-ఆదివారం మధ్యాహ్నం జగన్ పులివెందులకు వస్తారని వెల్లడి

కడప, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : కడప జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ వేళ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కడప, పులివెందులలో అధికార టీడీపీ కూటమి నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని, వైసీపీ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పోలింగ్ రోజున వైసీపీని ఇబ్బంది పెట్టాలనే లక్ష్యంతోనే కూటమి నేతలు దౌర్జన్యాలకు దిగుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఓట్లు వేయడానికి రావొద్దని వైసీపీ సానుభూతిపరులను బెదిరిస్తున్నారు టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి, ఓట్లు వేయడానికి రావొద్దని వైసీపీ సానుభూతిపరులను బెదిరిస్తున్నారని అవినాశ్ రెడ్డి ఆరోపించారు. అంతేకాకుండా, అసలైన ఓటర్ల స్లిప్పులను దొంగ ఓటర్లకు పంచుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ అక్రమాలు, దౌర్జన్యాలపై న్యాయపోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఎన్నికల అనంతరం ఎలక్షన్ పిటిషన్లు దాఖలు చేసి, ఈ దౌర్జన్యాలను కోర్టు దృష్టికి తీసుకెళతామని స్పష్టం చేశారు. ప్రతి పోలింగ్ బూత్‌లో సీసీ ఫుటేజ్‌ను భద్రపరచాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలి

ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలని, బయట నియోజకవర్గాల నుంచి ఎవరూ రావొద్దని అవినాశ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కాగా, వైసీపీ అధినేత వైఎస్ జగన్ పర్యటనలో మార్పు జరిగిందని, అందరి సూచనల మేరకు ఆయన ఆదివారం మధ్యాహ్నం పులివెందులకు వస్తారని తెలిపారు

'గంజాయి కేసులు' పెడతామని ఎస్సైలు బెదిరిస్తున్నారు..

మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామ కృష్ణారెడ్డి

-యూనిఫాం కింద పచ్చ చొక్కాలు వేసుకొని పోలీసులు -టీడీపీ ఏజెంట్లుగా పనిచేస్తున్నారన్న పిన్నెల్లి

-అబద్ధపు హామీలతో అధికారం లోకి వచ్చిన కూటమి ప్రభుత్వం -అరాచకాలకు పాల్పడుతోందని మండిపాటు

-నిరసన తెలిపిన తమపై 33 కేసులు నమోదు చేశారని ఆవేదన

మాచర్ల, పల్నాడు జిల్లా , ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని అరాచకాలకు పాల్పడుతోందని, పోలీసులు తమ యూనిఫాంల కింద పచ్చ చొక్కాలు ధరించి టీడీపీ ఏజెంట్లుగా పనిచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. మాచర్లలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై, పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

వైసీపీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది

అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం... వైసీపీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని పిన్నెల్లి ఆరోపించారు. టీడీపీ గూండాలు దాడులు చేస్తుంటే అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని, వైసీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపేందుకు కుట్ర పన్నుతున్నారని అన్నారు. "మాచర్ల మున్సిపాలిటీలో ఒక కౌన్సిలర్ అభ్యర్థిపై టీడీపీ గూండాలు రక్తం వచ్చేలా దాడి చేశారు. బీఫామ్ సమర్పించడానికి వెళ్లినప్పుడు ఓ గంజాయి బ్యాచ్ దాడి చేసి పత్రాలు చించివేసింది" అని ఆయన వివరించారు.

తమపై 33 కేసులు నమోదు

శాంతియుతంగా నిరసన తెలిపిన తమపై 33 కేసులు నమోదు చేశారని, కానీ దాడులు చేసిన వారిని వదిలేశారని పిన్నెల్లి ఆవేదన వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లాలో పోలీస్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయిందని, దీనిపై ఆధారాలతో ఎస్ఈసీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. కారంపూడి, దుర్గి, వెల్దుర్తి, నాగార్జున సాగర్ ఎస్సైలు టీడీపీ ఏజెంట్లుగా వ్యవహరిస్తూ, పోటీ నుంచి తప్పుకోకపోతే గంజాయి కేసులు పెడతామని అభ్యర్థులను బెదిరిస్తున్నారని ఆరోపించారు.

బెయిల్ రద్దు చేస్తామని బెదిరించినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు

తమ ప్రభుత్వ హయాంలో మాచర్లలో 5,400 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని, రింగ్ రోడ్డు నిర్మించామని, ఆసుపత్రిని అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, బెయిల్ రద్దు చేస్తామని బెదిరించినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో అధికారంలోకి వచ్చాక సిట్ ఏర్పాటు చేసి, ఈ అరాచకాలకు పాల్పడిన వారిని శిక్షిస్తామని హెచ్చరించారు

కీసర దాయర గ్రామంలో ఘనంగా బోడ్రాయి ప్రతిష్ఠాపన, బోనాల ఉత్సవాలు

నాగారం, అక్టోబర్ 31:-(జర్నలిస్ట్ డైరీ) మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్, కీసర డివిజన్ కీసర దాయర గ్రామంలో శనివారం నిర్వహించిన బోడ్రాయి ప్రతిష్ఠాపన మరియు బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు ముఖ్య అతిథిగా డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

కుషాయిగూడ శివ సాయి నగర్ లో పిడుగుపాటు

- తప్పిన పెను ప్రమాదం

నాగారం, అక్టోబర్ 31:-(జర్నలిస్ట్ డైరీ) కాప్రా సర్కిల్ కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శివ సాయి నగర్ లో శుక్రవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కురిసిన భారీ వర్షంలో ఒక్కసారిగా పెద్ద శబ్దం చేస్తూ ఇండ్ల మధ్యన ఉన్న తాటి చెట్టు పై పిడుగు పడింది. ఒకసారిగా మంటలు చెలరేగాయి.చుట్టుపక్కల కుటుంబాలు భయాందోళనకు లోనయ్యారు.ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తొలగింపుకు ఈటల పాదయాత్ర విజయవంతం...

నాగారం, అక్టోబర్ 31:-(జర్నలిస్ట్ డైరీ) జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తొలగింపు కోసం మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్ర విజయవంతంగా సాగిందని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కె చంద్రారెడ్డి తెలిపారు. ఎదులాబాద్ నుంచి జవహర్‌నగర్ వరకు సాగిన పాదయాత్రకు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారని తెలిపారు.

మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూలమాలలతో సత్కరించి, హారతులతో స్వాగతం పలికారని తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, జిల్లా నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారని వివరించారు.

ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా మరియు వార్తాపత్రిక మీడియాకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

డంపింగ్ యార్డ్ తొలగింపే మనందరి లక్ష్యం. ప్రజల మద్దతుతో ఈ పోరాటం విజయవంతమయ్యే వరకు కొనసాగాలని ఆయన కోరారు.

ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి..

401- మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

జర్నలిస్ట్ డైరీ, ఎల్బీనగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్బీనగర్ పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. ఎల్బీనగర్ కామినేని హాస్పిటల్ చౌరస్తా వద్ద ఉన్న ఆగ్రా స్వీట్ షాప్ సమీపంలో గత రెండు రోజుల క్రితం ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి ఉందని పోలీస్లకు డయల్ 100కు సమాచారం వచ్చింది. వెంటనే పోలీసులు అక్కడ చేరుకుని కింద పడిపోయిన వ్యక్తి పరిశీలించగా అతను అప్పటికే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి వయస్సు (60) ఉంటుందని పోలీసులు తెలిపారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృత దేహాన్ని పోస్ట్మార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్ కు తరలించారు.

నేడే అఖిల భారత శాంతి సంఘం జిల్లా 4 వ మహాసభ

జర్నలిస్టు డైరీ, ఎల్బీనగర్
అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రంగారెడ్డి జిల్లా 4 వ మహాసభ ఆదివారం ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ నగర్ వ్యవసాయ మార్కెట్ లో జరుగుతుంది అని జిల్లా అధ్యక్షుడు తిప్పర్తి మహేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతి లక్ష్యంగా అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ఈ మహాసభకు సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కే. వి.యల్, రాష్ట్ర నాయకులు డాక్టర్ తిప్పర్తి యాదయ్య, రంగారెడ్డి జిల్లా కమిటీ ఆహ్వాన సంఘం అధ్యక్షులు పల్లె వినయకుమార్, ఇతర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. జిల్లాల్లో ఉన్న శాంతి సంఘం నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జగన్ ఆస్తుల కేసు విచారణ ముమ్మరం.. 45 డిశ్చార్జి పిటిషన్లపై విచారణ పూర్తి

-డిశ్చార్జి పిటిషన్లపై దూకుడుగా విచారణ
-సీబీఐ, ఈడీ కేసులపై కొనసాగుతున్న రోజువారీ విచారణ
-కేసుల భవిష్యత్తుపై సర్వత్ర ఉత్కంఠ

అమరావతి,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ
వైసీపీ అధినేత జగన్ ఆస్తుల కేసుల విచారణలో కీలక పరిణామం చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టు ఈ కేసుల విచారణను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఇండియా సిమెంట్స్‌కు సంబంధించిన ఛార్జిషీట్‌లో దాఖలైన డిశ్చార్జి పిటిషన్లపై వాదనలు ముగిశాయి. అనంతరం, భారతీ సిమెంట్స్ కేసుకు సంబంధించిన పిటిషన్లపై విచారణను న్యాయస్థానం ప్రారంభించింది.

విచారణ దశలోనే నిలిచిపోయిన కేసులు వేగవంతం

దశాబ్ద కాలంగా ఈ కేసులు విచారణ దశలోనే నిలిచిపోయాయని, వీటిని వేగవంతం చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో విచారణ ప్రక్రియ వేగమందుకుంది. హైకోర్టు ఆదేశాలతో సీబీఐ, ఈడీ కేసులపై న్యాయస్థానం రోజువారీ విచారణ చేపడుతోంది. ఇప్పటివరకు ఆరు సీబీఐ ఛార్జిషీట్లకు సంబంధించి మొత్తం 45 డిశ్చార్జి పిటిషన్లపై విచారణ పూర్తయింది.

45 డిశ్చార్జి పిటిషన్లపై సీబీఐ కోర్టు ఒకేసారి ఆదేశాలు

జగన్‌తో పాటు విజయసాయిరెడ్డి, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, మోపిదేవి వెంకటరమణ, పారిశ్రామికవేత్త నిమ్మగడ్డ ప్రసాద్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య, అయోధ్య రామిరెడ్డి వంటి పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. విచారణ పూర్తయిన ఈ 45 డిశ్చార్జి పిటిషన్లపై సీబీఐ కోర్టు ఒకేసారి తన ఆదేశాలను వెలువరించనుంది. దీంతో ఈ కేసుల భవిష్యత్తుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది

విద్యుత్ పునరుద్ధరణకు సాయం చేయండి-తమిళనాడును కోరిన ఏపీ

-అర్నాబ్ తుపాను నష్టంపై తమిళనాడుకు వివరించిన మంత్రి గొట్టిపాటి రవి
-విద్యుత్ పునరుద్ధరణ పనులకు సిబ్బందిని పంపాలని విజ్ఞప్తి
-ఏపీకి సాయం చేసేందుకు తమిళనాడు సానుకూలత
-సీఎం చంద్రబాబు ఆదేశాలతో తమిళనాడు మంత్రితో మాట్లాడిన గొట్టిపాటి
-ఇప్పటికే తెలంగాణ నుంచి విద్యుత్ సిబ్బంది సాయం పొందుతున్న ఏపీ

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
'అర్నాబ్' తుపాను ధాటికి కుదేలైన ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర చర్యలు చేపట్టింది. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయానికి తోడు, తాజాగా తమిళనాడు సహకారాన్ని కూడా ఏపీ ప్రభుత్వం కోరింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, తమిళనాడు విద్యుత్ శాఖ మంత్రి సి.టి.ఆర్. నిర్మల్ కుమార్‌తో ఫోన్లో మాట్లాడారు.

అపార నష్టాన్ని గురించి తమిళనాడు మంత్రికి వివరించిన మంత్రి గొట్టిపాటి

తుపాను కారణంగా రాష్ట్రంలో, ప్రధానంగా విద్యుత్ రంగానికి సంభవించిన అపార నష్టాన్ని గొట్టిపాటి రవికుమార్ ఈ సందర్భంగా తమిళనాడు మంత్రికి వివరించారు. ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించేందుకు అదనపు సిబ్బంది అవసరముందని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో తగినంత మంది విద్యుత్ సిబ్బందితో పాటు అవసరమైన పరికరాలను పంపి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తమిళనాడు మంత్రి నిర్మల్ కుమార్ సానుకూల స్పందన

మంత్రి గొట్టిపాటి విజ్ఞప్తికి తమిళనాడు మంత్రి నిర్మల్ కుమార్ సానుకూలంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌కు అవసరమైన సిబ్బందిని, సామగ్రిని పంపేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. కాగా, విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే తెలంగాణ నుంచి సహాయం పొందుతున్న విషయం విదితమే. తెలంగాణ సరిహద్దు జిల్లాలకు చెందిన విద్యుత్ సిబ్బంది ప్రస్తుతం ఏపీలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోంది.. రాప్తాడు ఘటనే నిదర్శనం...వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్

-రాప్తాడు పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై కిరాతక దాడి
-టీడీపీ పాలనలో శాంతి, భద్రతలు పూర్తిగా విఫలమయ్యాయన్న మాజీ సీఎం జగన్
-ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి, నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని హామీ
-బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం
-ఘటనపై విస్తృత దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, -నిందితుడి కోసం గాలింపు

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, రాష్ట్రంలో 'జంగిల్ రాజ్' నడుస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన కిరాతక దాడి ఘటన, టీడీపీ కూటమి పాలనలో నెలకొన్న అరాచక పరిస్థితులకు అద్దం పడుతోందని ఆయన అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.

భద్రత కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది

"రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, తరగతి గదిలోనే ఒక విద్యార్థినిపై రంపంతో జరిగిన కిరాతక దాడి.. టీడీపీ కూటమి పాలనలో శాంతి భద్రతలు ఎంతగా విఫలమయ్యాయో స్పష్టం చేస్తోంది. ఒక ప్రభుత్వ పాఠశాలలోకి దుండగుడు స్వేచ్ఛగా ఎలా ప్రవేశించి, ఒక బాలికపై ఇంత దారుణంగా దాడి చేయగలిగాడు? విద్యాసంస్థల్లో కూడా పిల్లలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది" అని జగన్ పేర్కొన్నారు. బాధితురాలిని కాపాడే ప్రయత్నంలో మరో విద్యార్థిని కూడా గాయపడటం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

'రెడ్ బుక్' పాలనకే ప్రాధాన్యం

ప్రభుత్వం పాలనను పక్కనపెట్టి, రాజకీయ కక్ష సాధింపులు, 'రెడ్ బుక్' పాలనకే ప్రాధాన్యం ఇస్తోందని, దీనివల్లే నేరస్థులు చట్టమంటే భయం లేకుండా రెచ్చిపోతున్నారని జగన్ ఆరోపించారు. గాయపడిన విద్యార్థినులకు తక్షణమే అత్యుత్తమ వైద్యం అందించాలని, వారి కుటుంబాలకు ప్రభుత్వం ధైర్యం చెప్పాలని డిమాండ్ చేశారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి, పారదర్శక విచారణ ద్వారా కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలపై తక్షణమే సమీక్ష జరపాలని, ఈ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ పూర్తి బాధ్యత వహించాలని జగన్ అన్నారు.

ఘటన వివరాలు, ప్రభుత్వ స్పందన

రాప్తాడులోని ఓ పాఠశాలలో శనివారం ఓ దుండగుడు తరగతి గదిలోకి ప్రవేశించి పదో తరగతి విద్యార్థినిపై ఎలోక్ట్రిక్ రంపంతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో విద్యార్థిని ముఖం, తల, గొంతు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఆమె కుడి చేయి దాదాపు తెగిపోయినట్లు సమాచారం. ఆమెను కాపాడబోయిన మరో విద్యార్థిని కూడా తీవ్రంగా గాయపడింది. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో, వారిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు.

చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి

మరోవైపు, ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె కోలుకునే ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని, అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైద్య బృందాన్ని ఆదేశించానని తెలిపారు. "ఈ ఘాతుకానికి పాల్పడిన మృగాడిని పట్టుకుని, చట్టపరంగా కఠిన శిక్ష పడేలా చూడాలని పోలీసులను ఆదేశించాను" అని చంద్రబాబు స్పష్టం చేశారు. అనంతరం ఆయన బాధితురాలి తల్లితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన మరో విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి గురించి కూడా ఆయన ఆరా తీశారు. ఈ ఘటనను నారా లోకేశ్ కూడా తీవ్రంగా ఖండించారు.

ఘటనపై పోలీసులు విస్తృత స్థాయి దర్యాప్తు

ఈ ఘటనపై పోలీసులు విస్తృత స్థాయి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని గుర్తించి, అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

బంగాళాఖాతంలో కొత్త వాయుగుండం.. ఇస్రో శాటిలైట్ కెమెరాకు చిక్కిన దృశ్యాలు

-బంగాళాఖాతంలో ఏర్పడిన కొత్త వాతావరణ వ్యవస్థ
-ఇస్రోకు చెందిన ఇన్ శాట్-3డీఎస్ శాటిలైట్ ద్వారా గుర్తింపు
-ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతున్న అల్పపీడనం
-ఏపీ తీరంలో అతి భారీ వర్షాలు, ఈదురుగాలులకు అవకాశం



అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
బంగాళాఖాతంలో మరో తుపాను రూపుదిద్దుకుంటోంది. అర్నబ్ తుపాను తీరం దాటిన కొద్ది రోజులకే, ఆగ్నేయ బంగాళాఖాతంలో మేఘాలు దట్టంగా ఏర్పడి ఒక వ్యవస్థగా మారుతున్న దృశ్యాలను ఇస్రోకు చెందిన ఇన్ శాట్-3డీఎస్ శాటిలైట్ శనివారం ఉదయం గుర్తించింది. ఈ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతుండటంతో అధికారులు దీనిని నిశితంగా గమనిస్తున్నారు.

వాయుగుండంగా బలపడిన తుఫాను

అక్టోబర్ 29న దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనంగా మొదలైన ఈ వ్యవస్థ, పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. అక్టోబర్ 31 సాయంత్రం నాటికి ఇది వాయుగుండంగా బలపడింది. రానున్న రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదిలే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేస్తోంది. తాజా శాటిలైట్ చిత్రాల్లో ఒక సుడి లాగా వాయుగుండం స్పష్టంగా కనిపిస్తోంది.

ఏపీ తీర ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం

దీని ప్రభావంతో దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవుల్లో, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడవచ్చని, ఆ సమయంలో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. అయితే, ప్రస్తుతానికి పోర్టులకు ఎలాంటి హెచ్చరికలు జారీ చేయలేదు

విద్యార్థినిపై దాడి అమానుషం.. నిందితుడిని వదలొద్దు...ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

-రాప్తాడులో విద్యార్థినిపై దాడి -ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన
-నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని పోలీసులకు ఆదేశం
-బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై అనంతపురం కలెక్టర్‌తో ఆరా
-విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా



అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
అనంతపురం జిల్లా రాప్తాడు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన దాడి ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. తరగతి గదిలోకి చొరబడి ఓ ఉన్మాది విద్యార్థినిపై దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, ఇలాంటి అమానుష ఘటనలకు సమాజంలో చోటు లేదని స్పష్టం చేశారు.

అనంతపురం జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అరాఈ ఘటన గురించి తెలిసిన వెంటనే పవన్ కల్యాణ్.. అనంతపురం జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితుడిని తక్షణమే అరెస్టు చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితి గురించి ఆయన ఆరా తీశారు.

విద్యార్థినికి సాధ్యమైనంత మెరుగైన వైద్య సహాయం అందించాలి

దాడిలో గాయపడిన విద్యార్థినికి సాధ్యమైనంత మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. అదే ఘటనలో గాయపడిన మరో విద్యార్థినికి కూడా మెరుగైన చికిత్స అందేలా చూడాలని సూచించారు. బాధితురాలి కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. ఈ దారుణ ఘటనపై తక్షణమే స్పందించి, కఠినమైన చర్యలకు ఉపక్రమించాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465